సమస్త ప్రక్షాళనం
# సత్యమేవ జయతే
తెలుగు దినపత్రిక
- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్



ప్రచురణ : సంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 147, ఎడిటర్ : జె. భాస్కర్, గురువారం 25-06-2026 పేజీలు : 12 వెల : 2/-

- ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నాయకులకు సీఎం రేవంత్ ఆదేశం
- మహేశ్ కుమార్ అధ్యక్షతన జరిగిన జూమ్ సమావేశంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి
- ఎస్ఐఆర్‌పై నిర్లక్ష్యంగా వ్యవహస్తే క్షమించేది లేదని స్పష్టం
- ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ నేతలకు సీఎం రేవంత్ హెచ్చరిక
- నిర్లక్ష్యం చేస్తే ఇన్‌చార్జిల మార్పు తప్పదని స్పష్టం
- పది రోజుల పాటు నేతల పనితీరుపై నిఘా
- గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచన
- పేదల ఓటు హక్కులను కాపాడాలని పిలుపు

# పేదల ఓట్లు పోతే వాళ్ల
# ఆధార్ కార్డు, రేషన్ కార్డు పోతుంది



పార్టీకి నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోం : రాష్ట్రంలో రేపటి నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో అప్రమత్తమైంది. ఈ ప్రక్రియను సీరియస్‌గా పరిగణిస్తోంది. ఇవాళ ఉదయం జరిగిన జూమ్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు పాల్గొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ బాధ్యులు మరింత అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎస్ఐఆర్ విషయంలో కొందరు నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీకి నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. జిల్లాల వారీగా నిర్వహించిన అవగాహన సదస్సులకు చెందిన పూర్తి వివరాలు తన వద్ద ఉన్నాయని, ఎవరెవరు నిర్లక్ష్యం చేస్తున్నారో పేర్లతో సహా వెల్లడించగలనని,

మిగతా 2లో

రాష్ట్రంలో రేపటి నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా పేదలు, బడుగు బలహీన వర్గాలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇవాళ జరిగిన జూమ్ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌లు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, బీఎల్ఏలు, సర్పంచ్‌లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించడంతో పాటు ప్రతి అర్హత గల ఓటును కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.




2లో

## జమ్ముకశ్మీర్ ఎప్పటికీ మా అంతర్గత వ్యవహారమే

- ఐరాసలో పాక్‌కు భారత్ గట్టి కౌంటర్
- ఐరాస వేదికపై పాక్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన భారత్
- జమ్ముకశ్మీర్ అంశాన్ని రాజకీయ రంగు పులమేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోందని విమర్శ
- కశ్మీర్ భారత్ అంతర్గత వ్యవహారమేనని మరోసారి స్పష్టం చేసిన భారత ప్రతినిధి

## మహారాష్ట్రలో భారీ వర్షాలు



2లో

- విరిగిపడిన కొండచరియలు- కూలిన చెట్లు
- భారీ వర్షాలతో మల్షేజ్ ఘాట్‌లో విరిగిపడిన కొండచరియలు
- థానే జిల్లాలో చెట్లు కూలిపోవడం, అగ్నిప్రమాదాలకు సంబంధించి 27 ఫిర్యాదులు
- పలుచోట్ల వాహనాలకు నష్టం

## జొన్నగిరిలో స్వర్ణ కాంతులు... దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బంగారు గనిని ప్రారంభించిన సీఎం చంద్రబాబు



- కర్నూలు జిల్లా జొన్నగిరిలో దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బంగారు గని ప్రారంభం
- ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రాజెక్టు ప్రారంభోత్సవం
- ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి లక్ష్యంగా కార్యకలాపాలు
- ఈ గని ద్వారా రాష్ట్రానికి రాయల్టీ రూపంలో ఏటా రూ.144 కోట్ల వరకు ఆదాయం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 600 మందికి ఉపాధి అవకాశాలు

ఆంధ్రప్రదేశ్‌లో నూతన స్వర్ణయుగం ఆవిష్కృతమైంది. కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, జొన్నగిరిలో ఏర్పాటు చేసిన దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బంగారు గనిని ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి భారీగా ఆదాయం రావడంతో పాటు, స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. జియోమైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (GMSI) సుమారు రూ. 405 కోట్ల పెట్టుబడితో ఈ గనిని అభివృద్ధి చేసింది. 70 ఏళ్ల తర్వాత భారతదేశంలో సమీకృత ప్రాసెసింగ్ యూనిట్‌తో ఏర్పాటైన తొలి ప్రైవేట్ బంగారు గని ఇదే కావడం గమనార్హం. జొన్నగిరి, ఎర్రగుడి, పగిదిరాయ్ గ్రామాల పరిధిలో 597.82 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ ఓపెన్-పిట్ గని విస్తరించి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2026-27) ఈ గని నుంచి సుమారు 400 కిలోల బంగారం ఉత్పత్తి చేయాలని

మిగతా 2లో



## ట్రంప్ అధికారాలకు కత్తెర

- ఇరాన్‌తో యుద్ధాన్ని నిరోధిస్తూ అమెరికా సెనెట్ తీర్మానం
- టంప్‌కు వ్యతిరేకంగా యూఎస్ సెనెట్ కీలక తీర్మానం
- ముందస్తు అనుమతి లేకుండా యుద్ధానికి వెళ్లకుండా అధ్యక్షుడి అధికారాలను కట్టడి చేసే తీర్మానానికి సెనెట్ ఆమోదం
- డెమొక్రాట్ల తీర్మానానికి రిపబ్లికన్లు మద్దతు

2లో

## తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు..!

- కేంద్ర సర్వీసుల నుంచి సొంత కేడర్‌కు వచ్చిన సీనియర్ ఐఏఎస్
- ఈ నెల 30న ప్రస్తుత సీఎస్ కె. రామకృష్ణారావు పదవీ విరమణ
- కేంద్రంతో సమన్వయం కోసమే రేవంత్ రెడ్డి వ్యూహాత్మక ఎంపిక



2లో

## తెలుగు రాష్ట్రాల్లో ఈ నెలాఖరు వరకు విస్తారంగా భారీ వర్షాలు



2లో

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఆహ్వానం.. స్వయంగా లేఖ రాసిన ఇరాన్ అధ్యక్షుడు!



2లో



2లో

## తెలంగాణలో హిట్లర్ పాలన: ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

## బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ. 100 కోట్లు కట్టాల్సిందే.. నీరవ్ మోదీకి లండన్ కోర్టు ఆదేశం



2లో

# పేదల ఓట్లు పోతే వాళ్ల ఆధార్ కార్డు, రేషన్ కార్డు పోతుంది : సీఎం రేవంత్ రెడ్డి

కానీ ఆ పరిస్థితులు తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

**ఎస్ఐఆర్‌పై విస్తృత అవగాహన కల్పించండి :** ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం సూచించారు. ఇన్‌ఛార్జ్ మంత్రులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించిన రేవంత్ రెడ్డి, ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు.

పేదల ఓట్లు జాబితాల నుంచి తొలగిపోతే వారి హక్కులు దెబ్బతింటాయని, అలాంటి పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. పార్టీ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఎస్ఐఆర్ విషయంలో పార్టీ నిర్ణయాలను పట్టించుకోని ఇన్‌ఛార్జ్‌లను తొలగించి కొత్తవారిని నియమిస్తామని హెచ్చరించారు. తీవ్రమైన ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించబోమని, పని చేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తే సహించబోమని కూడా స్పష్టం చేశారు. మరో పది రోజులు వేచి చూస్తామని, అప్పటికీ పనితీరులో మార్పు రానట్లయితే చర్యలకు ఉపక్రమిస్తామని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. గ్రామాల్లో సర్పంచ్‌ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

**అర్హత గల ప్రతి ఓటూ కాపాడండి :** రేపటి నుంచి ప్రారంభమయ్యే ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. నియోజకవర్గాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దని సూచించారు. దేశవ్యాప్తంగా బీజేపీ అనుసరిస్తున్న రాజకీయ వ్యూహాలను గమనించాలని పేర్కొన్నారు. బంగాల్‌లో టీఎంసీ అప్రమత్తంగా లేకపోవడం వల్ల తీవ్ర నష్టం చవిచూసిందని తెలిపారు. ఇక్కడ కూడా బీజేపీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే అవకాశం ఉన్నట్లు హెచ్చరించారు. అందుకే ప్రతి అర్హత గల ఓటును కాపాడటమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలక పాత్ర పోషించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణతో ఓటరు జాబితాలను పరిశీలించాలని ఆదేశించారు.

రేపటి నుంచి ప్రారంభమయ్యే ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, ప్రతి నాయకుడు చురుగ్గా పాల్గొనాలని ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించారు. ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని ఆమె అభివర్ణించారు.

# ట్రంప్ అధికారాలకు కత్తెర

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకపక్ష సైనిక అధికారాలకు చెక్ పెట్టేలా అమెరికా సెనెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇరాన్‌తో యుద్ధానికి కాంగ్రెస్ ముందస్తు అనుమతి లేకుండా అమెరికా దళాలను పంపడాన్ని నిరోధిస్తూ, అలాగే ప్రస్తుతం నెలకొన్ని ఉద్రిక్తతల నుంచి యూఎస్ బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలని సెనెట్ ఒక ఉమ్మడి తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానం విషయంలో ట్రంప్ సొంత పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీకి చెందిన కొందరు సీనియర్ సభ్యులు సైతం ప్రతిపక్ష డెమొక్రాట్లతో చేతులు కలపడం ఆశ్చర్యకరం. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగి, అది తీవ్రస్థాయి యుద్ధానికి దారితీయవచ్చనే ఆందోళనల నేపథ్యంలో కాంగ్రెస్ ఈ అడుగు వేసింది.

**అటు ఓట్లు ఇటు– ఇటు ఓట్లు అటు..**

అమెరికా సెనెట్‌లో జరిగిన ఈ ఓటింగ్ ఉత్కంఠగా సాగింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 50 ఓట్లు, వ్యతిరేకంగా 48 ఓట్లు వచ్చాయి. దీంతో ట్రంప్ దూకుడుకు కళ్లెం పడినట్లు అయ్యింది. వాస్తవానికి సెనెట్‌లో టంప్‌కు రిపబ్లికన్ పార్టీకి మెజారిటీ ఉంది. అయినప్పటికీ, నలుగురు రిపబ్లికన్ సెనేట ర్లు రాండ్ పాల్ (కెంటుకీ), సుసాన్ కాలిన్స్ (మైన్), లిసా ముర్కోవ్‌స్కీ (అలాస్కా), బిల్ కాసిడీ (లూసియానా) ట్రంప్‌కు వ్యతిరేకంగా ఓట్లు వేశారు. దీంతో తీర్మానం నెగ్గింది. అలాగే, డెమొక్రాటిక్ పార్టీకి చెందిన సీనియర్ సెనేటర్ జాన్ ఫెటర్మన్ పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకి స్తూ ట్రంప్‌కు అనుకూలంగా ఓటు వేయడం విశేషం. గతంలో ఇలాంటి యుద్ధ అధికారాల పరిమితి తీర్మానాలను తీవ్రంగా వ్యతిరే కించిన రిపబ్లికన్ పక్ష నేత మిచ్ మెక్‌కానెల్, దేవ్ మెక్‌కార్మిక్‌లు ఓటింగ్‌కు హాజరుకాకపోవడం డెమొక్రాట్లకు కలిసివచ్చింది. సెనెట్‌లో ప్రవేశపెట్టడానికి ముందే ఈ తీర్మానం అమెరికా దిగువ సభ అయిన 'హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్'లో 215-208 ఓట్ల తేడాతో ఆమోదం పొందింది. దిగువ సభలో కూడా నలుగురు రిపబ్లికన్ ప్రతినిధులు పార్టీని కాదని డెమొక్రాట్లతో కలిసి నడిచారు.

**ట్రంప్ ఆగ్రహం..**

సొంత పార్టీ వారే తనకు వ్యతిరేకంగా ఓటు వేయడంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ట్రూత్ సోషల్' వేదికగా స్పందిస్తూ, ఈ తీర్మానానికి మద్దతు ఇచ్చిన ప్రజాప్రతినిధులను తీవ్ర పదజాలంతో దూషించారు. వారిని ప్రచారం కోసం ఆరాటపడేవా రుగా అభివర్ణించారు. ఇలా చర్యలకు దేశభక్తి లేనివి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.రెండు సభల్లోనూ ఈ తీర్మానం నెగ్గినప్పటికీ సాంకేతికంగా దీనికి చట్టబద్ధత ఉండదని వైట్ హౌస్ ఉన్నతాధికారి ఒకరు మీడియాతో చెప్పారు. 'ఈ ఉమ్మడి తీర్మానాలు అధ్యక్షుడి వద్దకు వెళ్లవు. వీటికి చట్టబద్ధత ఉండదు. కొందరు రిపబ్లికన్ సెనేటర్లు హాజరుకాకపోవడం వల్లే ఈ తీర్మానం నెగ్గింది తప్ప దీనికి పెద్ద ప్రాధాన్యత లేదు. పైగా, ఏప్రిల్ 7న కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంతోనే ఇరాన్- అమెరికా మధ్య యుద్ధం ముగిసింది. ప్రస్తుతం అక్కడ అమెరికా సైన్యం ఎలాంటి ప్రత్యక్ష యుద్ధంలోనూ లేదు. అందువల్ల అక్కడ నుంచి బలగాలను ఉపసంహరించుకో వాలనడం అర్థరహితం' అని ఆ అధికారి తెలిపారు.

**తప్పుబట్టిన డెమొక్రాట్లు..**

వైట్ హౌస్ అధికారి ప్రకటనను డెమొక్రాట్ వర్గాలు తప్పుబట్టాయి. 1973 నాటి 'వార్ పవర్స్ యాక్ట్' ప్రకారం కాంగ్రెస్ ఉమ్మడి తీర్మా నం ద్వారా ఆదేశిస్తే అధ్యక్షుడు సైన్యాన్ని వెనక్కి పిలవాల్సిందేనని స్పష్టం చేశాయి. ఇది కచ్చితంగా అధ్యక్షుడిని కట్టడి చేస్తుందని హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీ పేర్కొంది. దీని అమలుపై వైట్ హౌస్ మొం డికేస్తే, ఈ వ్యవహారం న్యాయపరమైన వివాదంగా మారి సుప్రీం కోర్టుకు వెళ్తుందని డెమొక్రాట్ ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు.

# మహారాష్ట్రలో భారీ వర్షాలు

మహారాష్ట్రలోని ముంబయి, థానే, పాల్ఘర్ జిల్లాల్లో గత 24 గంటలుగా కురుస్తున్న భారీ వర్షాలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మాల్షేజ్ ఘాట్‌లో స్వల్ప కొండచరియలు విరిగిపడగా, జిల్లాలో పలు చోట్ల చెట్లు కూలిపోయాయి. ఇదిలా ఉండగా ముంబయి, ఠానే, రాయ్‌గఢ్, పాల్ఘర్, సింధుదుర్గ్ జిల్లాలోల కు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

**మల్షేజ్ ఘాట్‌లో కొండచరియలు..** థానే జిల్లా రెసిడెంట్ డిప్యూటీ కలెక్టర్ సందీప్ మానే తెలిపిన వివరాల ప్రకారం, మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్య మల్షేజ్ ఘాట్‌లోని 'వాష్ పాయింట్', 'అంబ్రెల్లా పాయింట్' మధ్య కొండచరియలు విరిగిపడ్డాయి. ఘటన సమాచారం అందుకున్న వెంటనే అధికారులు భూమి తవ్వే యంత్రాలను ఘటనాస్థలికి తరలించారు. కొద్దిసేపట్లోనే శిథిలాలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. గత 24 గంటల్లో థానే జిల్లాలో మొత్తం 27 ఫిర్యాదులు నమోదయ్యాయని ప్రాంతీయ విపత్తు నిర్వహణ విభాగం (ఆర్‌డీఎంపీ) చీఫ్ యాసిన్ తడ్వీ వెల్లడించారు. వీటిలో 18 చెట్లు లేదా చెట్ల కొమ్మలు కూలిపోవడానికి సంబంధించినవి కాగా, మరో నాలుగు అగ్నిప్రమాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. బుధవారం ఉదయం థానే నగరంలోని చారాయ్ ప్రాంతంలో ఒక భారీ చెట్టు రహదారి పక్కన నిలిపి ఉంచిన రెండు కార్లపై కూలిపోయింది. దీంతో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి. చెట్టు కూలిన ఘటనలో ఎవరూ గాయపడకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే విపత్తు నిర్వహణ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని చెట్టును తొలగించే పనులు చేపట్టారు. బుధవారం ఉదయం 8.30 గంటలతో ముగిసిన 24 గంటల్లో థానే నగరంలో 77.97 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**ముంబయిలో భారీ వర్షం..** మంగళవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నగరంతో పాటు నవీ ముంబయిలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. కోపర్ ఖైరానే-గన్‌సోలి స్టేషన్ల మధ్య రైలు పట్టాల కింద మట్టి కొట్టుకపోవడంతో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. ప్రస్తుతం అక్కడ ట్రాక్ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. దాదర్ స్టేషన్‌లో రైలు పట్టాలపై నీరు నిలిచింది. విక్రోలి వెస్ట్‌లో రిటైయినింగ్ వాల్ కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనేక చోట్ల రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వరద నీరు భారీగా చేరడంతో అంధేరీలోని అండర్‌పాస్‌లో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. నవీ ముంబయిలోని భాజీ మార్కెట్‌లోకి నీరు చేరడంతో నిత్యావసర వస్తువుల రవాణాకు అంతరాయం ఏర్పడింది. గత 24 గంటల్లో 300 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ వెల్లడించింది. మహారాష్ట్రలో రానున్న రోజుల్లో మరింత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో థానే, పాల్ఘర్ జిల్లాల యంత్రాంగం అప్రమత్తమైంది. కొండచరియలు విరిగిపడే ప్రాంతాలు, చెట్లు కూలే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు..!

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి (చీఫ్ సెక్రటరీ)గా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియామకం దాదాపు ఖరారైంది. ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో ఉన్న ఆయనను తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్రం రిలీవ్ చేసింది. ప్రస్తుత సీఎస్ కె. రామకృష్ణారావు పదవీ కాలం జూన్ 30తో ముగియనుండటంతో అదే రోజున సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టనున్నారని అధికారిక వర్గాల సమాచారం.

**జాజు కెరీర్ ట్రాక్ రికార్డ్ ఇదే!...** 1992 బ్యాచ్, తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన సంజయ్ జాజు, దాదాపు 13 ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు కేంద్ర సర్వీసుల్లో పనిచేశారు. తెలంగాణ కేడర్ అధికారులలో ఇంత ఎక్కువ కాలం కేంద్ర సర్వీసుల్లో పనిచేసిన వారిలో ఆయన ఒకరు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ కార్యదర్శిగా, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా కీలక బాధ్య తలు నిర్వర్తించారు. ప్రస్తుత సీఎస్ పదవీ విరమణకు సరిగ్గా వారం రోజుల ముందు ఆయనను సొంత కేడర్‌కు పంపుతూ కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖనిన్న ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన నియామకం దాదాపు ఖాయమైంది. "తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థన మేరకు సంజయ్ జాజును ఆయన సొంత కేడర్‌కు తిరిగి పంపేందుకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపిందని" ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా, నాటి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సమర్థవంతంగా పనిచేశారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణం కేంద్రంలో ఆయనకున్న విస్తృత అనుభవం, పరిచయాలేనని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పలు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు, నిధులు సాధించేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖలతో బలమైన సమన్వయం అవసరమని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, రీజినల్ రింగ్ రోడ్, ప్రతిపాదిత బుల్లెట్ రైలు కారిడార్లు, రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్టు, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు, ఆర్థిక సహకారం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంలో సంజయ్ జాజుకున్న అనుభవం, అక్కడి పనివిధానంపై ఉన్న అవగాహన తెలంగాణకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి విశ్వసిస్తున్నట్లు సమాచారం. సీఎస్ పదవి కోసం సీనియర్ అధికారులు జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి వారి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నప్పటికీ, సుదీర్ఘ సర్వీస్ (2028 మార్చి వరకు), కేంద్రంలో ఉన్న నెట్‌వర్క్‌ను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చివరికి సంజయ్ జాజును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇక, ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ కాలం ఈ నెల 30తో ముగియనుంది. వాస్తవానికి 2025 ఆగస్టులోనే పదవీ విరమణ చేయాల్సి ఉన్నా, ఆయనకు రెండు విడతల్లో మొత్తం 10 నెలల పాటు ప్రభుత్వం పదవీ కాలాన్ని పొడిగించిన విషయం తెలిసిందే.

## జొన్నగిరిలో స్వర్ణ కాంతులు... దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బంగారు గనిని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రానున్న కాలంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏటా ఒక టన్ను (1000 కిలోలు)కు పెంచనున్నారు. ఇక్కడ మొత్తం 12 టన్నుల బంగారు నిక్షేపాలు ఉన్నాయని అంచనా. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా 300, పరోక్షంగా మరో 300 మందికి ఉపాధి లభించనుంది. ఈ గని కార్యకలాపాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో భారీ ఆదాయం అందనుంది. తొలి ఏడాది సుమారు రూ. 57 కోట్లు, పూర్తిస్థాయి ఉత్పత్తి ప్రారంభమయ్యాక ఏటా రూ. 144 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా. ఈ ఆదాయంతో పాటు డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ద్వారా స్థానిక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌లో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జొన్నగిరి ప్రాంతానికి 'స్వర్ణగిరి' అని పేరు మార్చాలనే ప్రతిపాదన కూడా ఉంది.

భారత్ ఏటా భారీగా బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు జొన్నగిరి గని ఒక చిన్న ముందడుగుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. హంద్రీనీవా కాలువ నుంచి 18 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా నీటిని సేకరించి, ఇక్కడే బంగారాన్ని శుద్ధి చేసి బంగారు కడ్డీల రూపంలో రిఫైనరీలకు పంపనున్నారు. కేంద్ర ప్రభుత్వ మైనింగ్ సంస్కరణల ఫలితంగా ఈ ప్రాజెక్టు సాకారమైంది.

# తెలుగు రాష్ట్రాల్లో ఈ నెలాఖరు వరకు విస్తారంగా భారీ వర్షాలు

- 30వ తేదీ వరకు తేలికపాట నుంచి మోస్తరు, భారీ వర్షాలు
- తెలంగాణలో 5 డిగ్రీల వరకు తగ్గనున్న ఉష్ణోగ్రతలు
- నేడు కోస్తాంధ్రలో, 28-30 మధ్య దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు
- తెలంగాణలోని 8 జిల్లాలకు ఎల్లో అలెర్ట్

ఎండలు, ఉక్కపోతలతో ఇబ్బంది పడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీపి కబురు అందించింది. రాబోయే వారం రోజుల పాటు (జూన్ 30 వరకు) రెండు రాష్ట్రాలలోనూ నైరుతి రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి, హైదరాబాద్ వాతావరణ కేంద్రాలు వెల్లడించాయి. ఈ కాలంలో అనేక ప్రాంతాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు, గంటకు 30 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ విస్తారమైన వర్షాల కారణంగా రాబోయే రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉంది.

ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే.. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాలతో కూడిన ఉత్తర కోస్తా ప్రాంతాలలో నేడు (24న) అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 29, 30 తేదీలలో ఇక్కడ వర్షాల తీవ్రత మరింత పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు వంటి దక్షిణ కోస్తా జిల్లాలలో ప్రారంభంలో మోస్తరు వర్షాలు ఉండి, జూన్ 28 నుండి 30 మధ్య విస్తారంగా భారీ వర్షాలు కురిసే వీలుంది. రాయలసీమ ప్రాంతంలో ఆరంభంలో తక్కువగా ఉన్నప్పటికీ, వారం చివర్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. తెలంగాణలో నేడు (24న) ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ సహా ఎనిమిది జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయంటూ ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వారం చివరి నాటికి హైదరాబాద్, రంగారెడ్డితో పాటు దక్షిణ జిల్లాలకు కూడా ఈ వర్షాలు విస్తరించనున్నాయి.

# జమ్ముకశ్మీర్ ఎప్పటికీ మా అంతర్గత వ్యవహారమే

ఐక్యరాజ్యసమితి భద్రతామండలి (యూఎన్‌ఎస్‌సీ)లో జమ్ముకశ్మీర్ అంశంపై పాకిస్థాన్ చేసిన వ్యాఖ్యలకు భారత్ గట్టి సమాధానం ఇచ్చింది. జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతం పూర్తిగా భారత దేశ అంతర్గత వ్యవహారమని, ఈ విషయంలో ఎలాంటి సందేహానికీ తావులేదని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని స్పష్టం చేశారు. యూఎన్‌ఎస్‌సీ అరియా-ఫార్ములా సమావేశంలో పాకిస్థాన్ ప్రతినిధి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. జమ్ముకశ్మీర్ అంశంపై భారత్ ఎప్పటినుంచో ఒకే విధమైన వైఖరిని పాటిస్తోందని హరీశ్ పర్వతనేని అన్నారు. జమ్ముకశ్మీర్ ఎప్పటికీ భారత్ అంతర్గత అంశమేనని పునరుద్ఘాటించారు. గతంలో ఎలా ఉందో, ప్రస్తుతం కూడా అలాగే ఉందని, భవిష్యత్తులోనూ అదే కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమావేశానికి సహ-అధ్యక్షత వహిస్తున్న దేశం తటస్థంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ఈ వేదికను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడానికి ప్రయత్నించడం ఆశ్చర్యకరమని హరీశ్ పర్వతనేని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ ప్రతినిధి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని ఆయన విమర్శించారు. భారత్ గతంలోనూ ఇదే విధంగా జమ్ముకశ్మీర్ తన అంతర్గత అంశమని, దానిపై మూడో దేశం జోక్యం అవసరం లేదని స్పష్టంగా చెబుతూ వస్తోంది.

# ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఆహ్వానం.. స్వయంగా లేఖ రాసిన ఇరాన్ అధ్యక్షుడు!

**ఖమేనీ అంత్యక్రియలకు మోదీకి ఇరాన్ ఆహ్వానం!**

**అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా లేఖ రాసిన వైనం**

**జులై 4 నుంచి అంత్యక్రియల కార్యక్రమాలు జులై 9న మష్హాద్‌లో ఖననం**

ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరుకావాలని భారత ప్రధాని మోదీని ఇరాన్ ఆహ్వానించినట్లు సమాచారం. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. మరి దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. భారత్ ఇప్పటివరకు ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల విషయంలో శాంతి, చర్చల ద్వారానే పరిష్కారం కావాలని తన వైఖరిని కొనసాగిస్తోంది. ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు జులై 4న ప్రారంభం కానున్నాయి. పలు దశల్లో జరిగే నివాళి కార్యక్రమాల అనంతరం జులై 9న ఆయన స్వస్థలమైన మష్హాద్‌లో ఖననం చేయనున్నారు. టెహ్రాన్, ఖోమ్ నగరాల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో జరిగిన అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో 86 ఏళ్ల ఖమేనీ మరణించినట్లు ఇరాన్ ప్రకటించింది. దాదాపు 36 ఏళ్ల పాటు ఆయన ఇరాన్‌కు సుప్రీం లీడర్‌గా సేవలందించారు. అంత్యక్రియలకు కోట్ల సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమానికి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తరఫున కూడా ప్రతినిధి బృందం హాజరుకానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇరాన్ అధ్యక్షుడు తనను కూడా ఆహ్వానించారని షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు.

# తెలంగాణలో హిట్లర్ పాలన: ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

- తెలంగాణలో హిట్లర్ తరహా పాలన సాగుతోందన్న హరీశ్ రావు
- ఖమ్మంలో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేస్తోందని ఆరోపణ
- మంత్రి పొంగులేటి ల్యాండ్ గ్రాబర్‌గా మారారంటూ తీవ్ర విమర్శ
- రైతు ఆశీర్వాద సభను క్షమాపణ సభగా మార్చాలని డిమాండ్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హిట్లర్ తరహా పాలన సాగిస్తోందని, ఖమ్మం జిల్లాలో పేదల ఇళ్లను కూల్చివేస్తూ దమనకాండకు పాల్పడుతోందని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేదలకు రక్షణగా నిలవాల్సింది పోయి, ల్యాండ్ గ్రాబర్‌గా వ్యవహరిస్తున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. రఘునాథపాలెంలో ఇళ్ల స్థలాల నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రఘునాథపాలెం పరిధిలోని సర్వే నంబర్ 218లో 625 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు అందజేసి, గృహలక్ష్మి పథకం కింద లబ్ధి చేకూర్చామని ఆయన గుర్తుచేశారు. నిరుపేదలు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడితే, ప్రస్తుత ప్రభుత్వం జేసీబీలతో వాటిని కూల్చివేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన చింతకాని మండలంలో నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'ను 'రైతుల క్షమాపణ సభ'గా మార్చుకోవాలని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. రైతుబంధు చెల్లింపులు, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల అంశాల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పలువురు ఎమ్మెల్సీలు, ఇతర బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. గత కొంతకాలంగా రెవెన్యూ మంత్రికి వ్యతిరేకంగా భూ, మైనింగ్ సమస్యలపై బీఆర్ఎస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్న నేపథ్యంలో హరీశ్ రావు చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ. 100 కోట్లు కట్టాల్సిందే.. నీరవ్ మోదీకి లండన్ కోర్టు ఆదేశం

- నీరవ్ మోదీకి లండన్ కోర్టులో భారీ ఎదురుదెబ్బ
- వ్యక్తిగత పూచీకత్తు కేసులో నీరవ్ మోదీ వాదనల తిరస్కరణ
- పీఎన్‌బీ కేసులో యూకే జైలులో నీరవ్ మోదీ

భారత్ నుండి పరారైన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి లండన్ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన కేసులో నీరవ్ మోదీ తన కంపెనీ రుణం కోసం ఇచ్చిన వ్యక్తిగత గ్యారెంటీ కింద 10.7 మిలియన్ డాలర్ల (సుమారు రూ.100 కోట్లు) కంటే ఎక్కువ మొత్తాన్ని చెల్లించాల్సిందేనని కోర్టు తీర్పునిచ్చింది. లండన్ సర్క్యూట్ కమర్షియల్ కోర్ట్ జడ్జి జస్టిస్ సైమన్ టింక్లర్ జూన్ 23 నాటి తీర్పులో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అసలు మొత్తం 4.1 మిలియన్ డాలర్లతో పాటు దానికి సంబంధించిన వడ్డీని కూడా నీరవ్ మోదీ నుంచి వసూలు చేయాలని ఆదేశించారు. ఈ గ్యారెంటీ చెల్లదని, తనకు సరైన డిమాండ్ నోటీసులు రాలేదని నీరవ్ మోదీ చేసిన వాదనలను కోర్టు పూర్తిగా తోసిపుచ్చింది.

**కేసు నేపథ్యం..** బ్యాంక్ ఆఫ్ ఇండియా జులై 2012లో దుబాయ్ ఆధారిత 'ఫైర్‌స్టార్ డైమండ్ ఎఫ్‌జెడ్‌ఈ' అనే నీరవ్ మోదీకి చెందిన సంస్థకు భారీ రుణాన్ని మంజూరు చేసింది. ఈ రుణ సదుపాయానికి గాను ఆగస్టు 3, 2013న నీరవ్ మోదీ వ్యక్తిగత పూచీకత్తు ఇచ్చారు. అయితే, 2018 ప్రారంభంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరిగిన భారీ కుంభకోణం వెలుగులోకి రావడంతో, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ రుణాన్ని వెనక్కి తీసుకుంది.

మార్చి, ఏప్రిల్ 2018తో పాటు అక్టోబర్ 2025లో కూడా బ్యాంకు పంపిన డిమాండ్ నోటీసులను నీరవ్ మోదీ, అతడి కంపెనీ పట్టించుకోలేదు. పీఎన్‌బీ కుంభకోణం కారణంగా ఫైర్‌స్టార్ గ్రూప్ కార్యకలాపాలు, నీరవ్ మోదీ అప్పులు తీర్చే సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నాయని, అందువల్ల రుణాన్ని వెనక్కి తీసుకోవడం సమర్థనీయమేనని కోర్టు అభిప్రాయపడింది. కాగా, ఈ అసలు మొత్తానికి సంబంధించిన సమ్మరీ జడ్జిమెంట్ మార్చి 2024 లోనే వెలువడటం గమనార్హం.

**నీరవ్ మోదీ ప్రస్తుత పరిస్థితి..** భారతదేశంలో దాదాపు రూ. 13,000 కోట్ల పీఎన్‌బీ రుణ మోసానికి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీ, మార్చి 2019లో అరెస్ట్ అయినప్పటి నుండి యూకే జైల్లోనే శిక్ష అనుభవిస్తున్నారు.

మనీలాండరింగ్, మోసం కేసులను ఎదుర్కొనేందుకు వీలుగా తనను భారతదేశానికి అప్పగించాలన్న నిర్ణయంపై ఆయన ఇంకా చట్టపరమైన పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ తాజా తీర్పుతో నీరవ్ మోదీపై ఆర్థిక, చట్టపరమైన ఒత్తిడి మరింత పెరిగింది. సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి భారతీయ దర్యాప్తు సంస్థలు నీరవ్ మోదీని దేశానికి రప్పించడానికి, నిధులను రికవరీ చేయడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో లండన్ కోర్టు తీర్పు బ్యాంకులకు భారీ ఊరటనిచ్చింది.

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కరువు









## ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్ త్రాగినీటి సౌకర్యం లేక ఇబ్బందులు

## ప్రభుత్వ పాఠశాలలో సిపిఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగింది

సమస్త ప్రక్షాళనం :నారాయణ ఖేడ్ ఈ సందర్భంగా సిపిఎం పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం నర్సింలు మాట్లాడుతూ నారాయణఖేడ్ పట్టణ కేంద్రంలో బాలురు బాలికల పాఠశాలలో సందర్శించడంతో విద్యార్థుల సంఖ్య ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య కనుక్కునంగా టాయిలెట్లు బాత్రూంలో లేక ఇబ్బందులు పడుతున్నారని బాలుర పాఠశాలలో వర్షాకాలంలో కూడా జీవన్ ఫంక్షన్ హాల్ వరకు టాయిలెట్ కు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు అలాగే పాఠశాలలో త్రాగు నేరు రెండు రోజులకు ఒకసారి రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ ఇంటి నుండి తెచ్చుకుంటున్నారని అన్నారు అలాగే బాలికల పాఠశాల 800 మంది విద్యార్థులు ఉంటే సరిపడా టాయిలెట్లు నీటి సౌకర్యం లేక దుర్వాసన వచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే టాయిలెట్లు నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు ప్రభుత్వం మాత్రం విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని గొప్పలు చెప్తుంది కొంతమంది అకౌంటెంట్ రికార్డ్ అసిస్టెంట్ డిప్టేషన్ మీద డి వో ఆఫీస్ లో పనిచేస్తూ జీతం నారాయణఖేడ్ హైస్కూల్లో తీసుకుంటున్నారు నైట్ వాచ్మెన్ పోస్ట్ భర్తీ చేయాలని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వాలు గొప్పలు చెప్పడం ఆపి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని లేనియెడల ఉద్యమాలు చేస్తామని అన్నారు

ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి రమేష్ రాంలాల్ మైపాల్ దినకర్ తదితరులు ఉన్నారు

# ఖేడ్ జడ్పీహెచ్ఎస్ కు 10 ల్యాప్ ట్యాప్ లను అందజేసిన అంనెంట్ డిజిటల్ సంస్థ




సమస్త ప్రక్షాళనం:నారాయణ ఖేడ్ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందించడం కోసం హైదరాబాదులోని అంనెట్ డిజిటల్ సాఫ్ట్వేర్ సంస్థ ప్రాంగణంలో 10 ల్యాప్ టాప్ లను నారాయణఖేడ్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మన్మధ కిషోర్, ఉపాధ్యాయులు రాజశేఖర్,చంద్ర శేఖర్ ఆచార్యలకు అందజేశారు.. సందర్భంగా అంనెంట్ డిజిటల్ సాఫ్ట్వేర్ సంస్థ ప్రతినిధులు సీఈవో కృష్ణ రెడ్డి, సీనియర్ డైరెక్టర్ వల్లి సూర్యదేవర, హర్షిత్ సక్సేన, అభిలాష్, మల్లేశ్వరి, లయన్స్ క్లబ్ సభ్యులు నాగరాజు, అరుణ, మాధవి సూర్య మాట్లాడుతూ ఖేడ్ ప్రభుత్వ పాఠశాలలో 900 మంది విద్యార్థులు చదవడం అభినందనీయమని అలాంటి పాఠశాలకు తమ సేవలు అవసరమని గుర్తించి లయన్స్ సభ్యులు చంద్ర శేఖర్ ఆచార్య కోరిక మేరకు 5 లక్షల విలువగల 10 ల్యాప్ ట్యాప్ లను అంనెంట్ డిజిటల్ సాఫ్ట్వేర్ సంస్థ సహకారంతో అందజేశామని, దీనిని పాఠశాల విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోవు రోజులలో పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో అంనెంట్ డిజిటల్ సాఫ్ట్వేర్ సంస్థ ప్రతినిధులు సీఈవో కృష్ణ రెడ్డి, సీనియర్ డైరెక్టర్ వల్లి సూర్యదేవర, హర్షిత్ సక్సేన, అభిలాష్, మల్లేశ్వరి, లయన్స్ క్లబ్ సభ్యులు నాగరాజు, అరుణ, మాధవి సూర్య,ఉపాధ్యాయులు రాజశేఖర్,చంద్ర శేఖర్ ఆచార్య తదితరులు పాలుగోన్నారు

# వివిధ శుభకార్యాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే









సమస్త ప్రక్షాళనం :నారాయణ ఖేడ్ కల్హేర్ మండలం పొమ్య నాయక్ తండాకు చెందిన శివరాం గారి కుమారుని వివాహం. కల్హేర్ మండలం మాసన్ పల్లి గ్రామానికి చెందిన మలిపెద్ది నారాయణ గారి కుమారుని వివాహం. శంకరంపేట్ (ఆ) మండలం వీరోజీపల్లి గ్రామానికి చెందిన శంకరయ్య గారి కుమారుని వివాహం. శంకరంపేట్(ఆ)మండలం గొట్టిముక్కల గ్రామానికి చెందిన అలిగే శంకరయ్య గారి కూతురి వివాహం. శంకరంపేట్ (ఆ) పట్టణంలో కోళ్లపల్లి గ్రామానికి చెందిన చాకలి శ్రీకాంత్ గారు నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మాత డ్రెస్సెస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.కంగ్టి మండలం జంగి(దీ) గ్రామానికి చెందిన గుల్ల విట్టల్ గారి కూతురి వివాహం. కంగ్టి మండలం దామరగిద్ద గ్రామానికి చెందిన కిషన్ రావు పటేల్ గారి మనమరాలి నామకరణ మహోత్సవ కార్యక్రమం.వివిధ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మాజీ డ్వీటీసీలు,ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ఉప సర్పంచ్లు, యువ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్,నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు ఉన్నారు.

# ముట్రాజ్ పల్లి తాళ్లగడ్డ తాండ లో జగదాంబ సేవాలాల్ విగ్రహ ప్రతిష్టాపన





మెదక్ జిల్లా కౌడిపల్లి, జూన్ 24, ( సమస్త ప్రక్షాళనం న్యూస్): మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలో ని ముట్రాజ్ పల్లి తాండలో జగదాంబ దేవి. సేవాలాల్ మహారాజ్ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామ పురోహితుడు మనోజ్ శర్మ పంతులు ఆధ్వర్యంలో గణపతి పూజ హోమం నిర్వహించారు. బుధవారం రోజున దేవత మూర్తుల జగదాంబ సేవాలాల్ ప్రతిష్టాపన జరిగింది. ఈ కార్యక్రమంలో09 వార్డ్ సభ్యులు నరేష్ రాంసింగ్ మోహన్ సుభాష్ .గోపాల్ నవీన్.ప్రవీణ్ .అనిల్. గుంజరి మాజీ

# నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పెద్ద చింతకుంట) లో ర్యాలీ నిరసన





నర్సాపూర్, జూన్ 24,( సమస్త పక్షాళనం న్యూస్):మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్ద చింతకుంట వద్ద ఏఐసీసీ,టీపీసీసీ ఆదేశాల మేరకు పార్లమెంట్లో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ప్రారంభించిన "ఛాత్రోన్ కి గూంజ్" ఉద్యమానికి మద్దతు ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్.

ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, తరచూ జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు, నియామక ప్రక్రియల్లో జాప్యాలు లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థులు కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతుంటే, పేపర్ లీకేజీల కారణంగా వారి శ్రమ వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి డిమాండ్ చేశారు.

ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన విధానాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు.యువత గొంతుకే దేశ భవిష్యత్తు -- ఛాత్రోన్ కి గూంజ్ విజయవంతం కావాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్, మెదక్ జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్, నర్సాపూర్ మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు అజ్మాత్,నర్సాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్, సర్పంచులు పద్మావతి అశోక్ గౌడ్, ఉదయ్ కుమార్, నాయకులు పాషా, సుధీర్ కుమార్ గౌడ్,నరేష్, సురేష్ గౌడ్, మోహన్ దాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు,అనుబంధ సంఘాల నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొనారు.

# వివిధ వివాహ వేడుకలలో పాల్గొన్న తెలంగాణ రక్షణ సేన TRS పార్టీ నారాయణఖేడ్ నియోజకవర్గం ఇంచార్జ్ బాపు మల్ శెట్టి

సమస్త ప్రక్షాళనం :నారాయణ ఖేడ్ నారాయణఖేడ్ యోజకవర్గం

-

1. నారాయణఖేడ్ మున్సిపల్ రెహ్మాన్ ఫంక్షన్ హాల్ లో నారాయణఖేడ్ మున్సిపల్ దత్తాత్రేయ కాలనీకి చెందిన ఆప్తులు శ్రీ సంటెల్లి అంజయ్య - కీర్తిశేషులు లక్ష్మి గార్ల కుమారుడు శ్రీ సునీల్- ప్రియాంక గార్ల వివాహ వేడుకలలో పాల్గొని
2. నాగాల్ గిద్ద మండలం ఇరాక్ పల్లి కిషన్ నాయక్ తాండకు చెందిన కమల్ నాయక్ గారి సోదరుని వివాహ వేడుకలలో పాల్గొని



3 కంగిటి మండలం కంగిటి గ్రామానికి చెందిన వడ్ల పండరి గారి కుమార్ ని వివాహ వేడుకలలో తెలంగాణ రక్షణ సేన ు=ా పార్టీ నారాయణఖేడ్ నియోజకవర్గం ఇంచార్జ్ బాపు మల్ శెట్టి గారు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలిపారు వారితోపాటు నాగల గిద్ద మండలం మాజీ వైస్ ఎంపీపీ పండరి యాదవ్. మాణిక్యం ముదిరాజ్. సుమన్ పాటిల్. సంతోష్ మాజీ సర్పంచ్. నగేష్. పీరుగొండ. రాజు. ఎల్లప్ప . హనుమారెడ్డి. గుండన్న మల్ గొండ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# గాయం నుంచి తిరిగొచ్చి.. తొలి రేసులోనే ఏషియన్ గేమ్స్‌కు అర్హత సాధించిన జ్యోతి యర్రాజి






గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేసిన జ్యోతి యర్రాజి
తొలి రేసులోనే ఏషియన్ గేమ్స్ 2026కు అర్హత
నేషనల్ ఇంటర్-స్టేట్ మీట్ 100 మీటర్ల హర్డిల్స్‌లో సత్తా
విశాఖకు చెందిన జ్యోతి ఏడాదికి పైగా ఆటకు దూరం

భారత అగ్రశ్రేణి అథ్లెట్, తెలుగు తేజం జ్యోతి యర్రాజి అద్భుతమైన పునరాగమనం చేసింది. తీవ్ర గాయం కారణంగా ఏడాదికి పైగా ట్రాక్ కు దూరమైన ఆమె, బరిలోకి దిగిన తొలి రేసులోనే 2026 ఆసియా క్రీడలకు అర్హత సాధించి తన సత్తా చాటింది. బుధవారం ప్రారంభమైన 65వ నేషనల్ ఇంటర్-స్టేట్ సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఈ ఘనత సాధించింది.

మహిళల 100 మీటర్ల హర్డిల్స్ హీట్స్‌లో పాల్గొన్న జ్యోతి, 13.14 సెకన్ల టైమింగ్‌తో లక్ష్యాన్ని పూర్తి చేసి ఏషియన్ గేమ్స్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. విశాఖపట్నంకు చెందిన 26 ఏళ్ల జ్యోతి, గతంలో మోకాలికి తగిలిన తీవ్ర గాయం కారణంగా సుదీర్ఘకాలం ఆటకు దూరమైంది. రిలయన్స్ ఫౌండేషన్ స్పోర్ట్స్‌లో పునరావాసం పొందిన తర్వాత ఆమె పాల్గొన్న తొలి టోర్నమెంట్ ఇదే.

గతేడాది హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో వివాదం అనంతరం రజత పతకం గెలిచిన జ్యోతి, 100 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డు హోల్డర్‌గా కొనసాగుతోంది. ఈసారి 100 మీటర్ల హర్డిల్స్‌తో పాటు 200 మీటర్ల విభాగంలోనూ ఏషియన్ గేమ్స్‌కు అర్హత సాధించాలని ఆమె లక్ష్యంగా పెట్టుకుంది. ఇదే ఈవెంట్‌లో నందిని కె. కూడా 13.24 సెకన్ల టైమింగ్‌తో ఆసియా క్రీడలకు అర్హత సాధించడం విశేషం. ఈ ఛాంపియన్‌షిప్‌లో మురళీ శ్రీశంకర్, జెస్విన్ ఆల్డ్రిన్ వంటి ప్రముఖ అథ్లెట్లు కూడా పాల్గొంటున్నారు.

# సంతోషంగా ఉండాలా? ఈ చిన్న అలవాట్లు జీవితాన్నే మార్చేస్తాయి!

ఆనందం అనేది ఒక్కరోజులో అకస్మాత్తుగా వచ్చేది కాదు. మంచి ఉద్యోగం వస్తే, ఇల్లు కొంటే, బ్యాంక్ బ్యాలెన్స్ పెరిగితేనే సంతోషంగా ఉంటామని చాలామంది భావిస్తారు. కానీ సైకాలజీ చెప్పేది మాత్రం మరోలా ఉంది. ఆనందం కూడా ఒక నైపుణ్యమే. దాన్ని ప్రతిరోజూ చిన్న చిన్న అలవాట్లతో పెంచుకోవచ్చు. జీవితంలో సమస్యలు లేకపోవడం ఆనందం కాదు. సమస్యల మధ్య కూడా మంచి విషయాలను గుర్తించడం, మనసును సరైన దిశలో నడిపించడం నిజమైన సంతోషానికి దారి తీస్తుంది. అందుకోసం పాటించాల్సిన 10 సులభమైన అలవాట్లు ఇవే.



**మంచి విషయాలను గుర్తించండి**
మన మెదడు సహజంగా సమస్యలపైనే ఎక్కువ దృష్టి పెడుతుంది. అందుకే రోజూ రాత్రి 'ఈ రోజు ఏం మంచి జరిగింది?' అని మిమ్మల్ని మీరే అడగండి. ఒక మంచి మాట వినడం, స్నేహితుడి సాయం, కుటుంబ సభ్యుడి ప్రేమ.. ఎంత చిన్న విషయమైనా గుర్తు చేసుకోండి. ఇలా చేయడం వల్ల ప్రతికూల ఆలోచనలు తగ్గుతాయి.

**ఇతరులతో పోల్చుకోవద్దు**
సోషల్ మీడియాలో కనిపించేది చాలా వరకు వారి జీవితంలోని మంచి క్షణాలే. వారి విజయాలను చూసి మీ జీవితాన్ని తక్కువగా అంచనా వేయకండి. ఇతరుల హైలైట్ వీడియోతో మీ నిజజీవితాన్ని పోల్చడం వల్ల నిరాశ పెరుగుతుంది. మీ ప్రయాణం మీది. దానిపైనే దృష్టి పెట్టండి.

**శరీరాన్ని కదిలించండి**
ఆనందానికి వ్యాయామం గొప్ప మందు. ఖరీదైన జిమ్ అవసరం లేదు. ఉదయం నడక, యోగా, సైక్లింగ్, డ్యాన్స్.. ఏదైనా సరే. రోజూ కొంతసేపు శారీరక శ్రమ చేస్తే మూడ్ మెరుగవుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.

**ఈ వ్యక్తులకు దూరంగా ఉండండి**
కొంతమందితో మాట్లాడిన తర్వాత ఉత్సాహం వస్తుంది. మరికొందరితో మాట్లాడితే మానసికంగా కుంగిపోతాం. అలాంటి వారితో హద్దులు పెట్టుకోవడం తప్పు కాదు. మీ మానసిక ప్రశాంతతను కాపాడుకోవడం కూడా అవసరమే.

**కృతజ్ఞతను అలవాటు చేసుకోండి**
రోజూ మీకున్న సౌకర్యాలను గుర్తు చేసుకోండి. మంచి భోజనం, కుటుంబం, ఆరోగ్యం, స్నేహితులు.. ఏదైనా కావచ్చు. కృతజ్ఞత భావం పెరిగితే లేనివాటికంటే ఉన్నవాటిపైనే మన దృష్టి నిలుస్తుంది.

**సరిపడా నిద్రపోండి**
నిద్రను త్యాగం చేసి మరీ పని చేయడం గొప్ప విషయం కాదు. నిద్రలేమి వల్ల మూడ్, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత దెబ్బతింటాయి. చిన్న సమస్యలు కూడా పెద్దవిగా అనిపిస్తాయి. కాబట్టి నాణ్యమైన నిద్రకు ప్రాధాన్యం ఇవ్వండి.

**చిన్న విజయాలనూ సెలబ్రేట్ చేసుకోండి**
జీవితంలో పెద్ద విజయాల కోసం ఎదురుచూస్తూ చిన్న విజయాలను చాలామంది మర్చిపోతారు. ఒక పని పూర్తి చేశారా? ఒక లక్ష్యానికి దగ్గరయ్యారా? మీరే మిమ్మల్ని అభినందించుకోండి. చిన్న విజయాలే పెద్ద విజయాలకు బలం.

**ఆశించకుండా మంచి చేయండి**
ఇతరులకు సాయం చేయడం మనకూ ఆనందాన్ని ఇస్తుంది. ఒకరికి తోడుగా నిలవడం, పెద్దలను పలకరించడం, అవసరమైన వారికి సాయం చేయడం వంటి చిన్న పనులు కూడా మనసుకు సంతృప్తిని ఇస్తాయి.

**నియంత్రించాలనే ఆలోచన వదిలేయండి**
ప్రపంచంలో ప్రతి విషయం మన చేతిలో ఉండదు. ట్రాఫిక్, ఆర్థిక పరిస్థితులు, ఇతరుల అభిప్రాయాలు.. వీటిని మార్చలేం. 'దీనిపై నేను ఏమైనా చేయగలనా?' అని ఆలోచించండి. చేయగలిగితే చర్య తీసుకోండి. లేకపోతే వదిలేయడం నేర్చుకోండి.

**నిజమైన సంబంధాలకు సమయం**
సోషల్ మీడియా సందేశాల కంటే ముఖాముఖి సంభాషణలు ఎక్కువ ఆనందాన్ని ఇస్తాయి. స్నేహితులు, కుటుంబ సభ్యులతో సమయం గడపండి. మనల్ని నిజంగా అర్థం చేసుకునేవారు కొంతమందే అయినా, అది వందల పరిచయాల కంటే విలువైన విషయం.

# 19 ఏళ్ల కుర్రాడు.. నెలకు రూ.1 కోటి సంపాదన.. ఏఐతో ఏం చేస్తున్నాడు?

**'ఏఐ' విద్యతో నెలకు కోటి రూపాయలు ఆర్జిస్తున్న 19 ఏళ్ల యువకుడు**
**కరోనా కష్టాలతో 13 ఏళ్లకే సొంతంగా ఏఐ నేర్చుకున్న ఆయుష్ సింగ్**
**టాప్‌మేట్ ప్లాట్‌ఫామ్ ద్వారా తన కోర్సులను విజయవంతంగా విక్రయం**

లింక్డిన్ పోస్టుతో వెలుగులోకి వచ్చిన స్ఫూర్తిదాయక కథ ఎటువంటి ఉన్నత విద్యాభ్యాసం కానీ, గొప్ప కుటుంబ నేపథ్యం కానీ లేకుండా, కేవలం తన అసాధారణ ప్రతిభతో ఓ 19 ఏళ్ల యువకుడు నెలకు కోటి రూపాయలు ఆదాయాన్ని ఆర్జిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) నైపుణ్యాలను బోధించే వ్యాపారం ద్వారా ఆయుష్ సింగ్ సాధిస్తున్న ఈ అద్భుత విజయం ప్రస్తుతం ఇంటర్నెట్‌లో సంచలనంగా మారింది. టాప్‌మేట్ సహ వ్యవస్థాపకుడు దినేష్




సింగ్ తన లింక్డ్‌ఇన్ ఖాతాలో ఆయుష్ ప్రస్థానం గురించి వివరించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.
కరోనా మహమ్మారి సమయంలో తన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకోవడంతో, కేవలం 13 ఏళ్ల వయసులోనే ఆయుష్ సింగ్ 'మెషిన్ లెర్నింగ్' నేర్చుకోవడం ప్రారంభించాడు. పాత ఆన్‌లైన్ కోర్సులు, అంతంతమాత్రంగా పనిచేసే ఇంటర్నెట్, ఒక సాధారణ లాప్‌టాప్‌తోనే తన ప్రయాణాన్ని మొదలుపెట్టాడు. తన పట్టుదలతో కొన్ని నెలల్లోనే అంతర్జాతీయ స్టార్టప్‌లతో కలిసి పనిచేసే స్థాయికి ఎదిగాడు. 14 ఏళ్లకే అతని పనితీరును ప్రఖ్యాత 'ఎంఐటీ' సైతం ప్రశంసించడం విశేషం. ఆ తదుపరి కాలంలో పలు సంస్థల్లో డేటా సైంటిస్ట్, ఎంఎల్‌ఆప్స్ ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, 'యాంటెర్న్', 'సెకండ్ బ్రెయిన్ ల్యాబ్స్' వంటి సంస్థలను కూడా స్థాపించాడు. దేశంలోని వందలాది మంది ఇంజనీర్లకు 'ఏఐ'లో శిక్షణనిస్తూ వారికి మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పించినప్పటికీ, తన నైపుణ్యాల ద్వారా భారీ మొత్తంలో ఆదాయం గడించడం ఆయుష్‌కు ఆరంభంలో ఒక సవాలుగా మారింది. ఈ తరుణంలో 'టాప్‌మేట్' అనే ప్లాట్‌ఫామ్ అతనికి దిశానిర్దేశం చేసింది.

తన కోర్సులను ఒక క్రమపద్ధతిలో ప్యాకేజీలుగా రూపొందించి, సరైన మార్కెటింగ్ వ్యూహాలతో విక్రయించడానికి ఈ వేదిక ఎంతగానో తోడ్పడింది. దీనివల్ల అతని వ్యాపారం ప్రస్తుతం నెలకు సుమారు కోటి రూపాయల ఆదాయాన్ని ఆర్జించే స్థాయికి చేరుకుంది. అద్భుతమైన నైపుణ్యాలు ఉన్నప్పటికీ, వాటిని వ్యాపార మార్గంలోకి మలుచుకోవడంలో చాలామంది విఫలమవుతున్న నేటి కాలంలో, ఆయుష్ సింగ్ సాధించిన విజయం ఎందరో యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

# సూపర్ కంప్యూటర్ల రేసులో చైనా మళ్లీ నంబర్ వన్... అమెరికాను వెనక్కి నెట్టిన 'లైన్‌షైన్'



సూపర్ కంప్యూటర్ల రంగంలో చైనా మరోసారి సత్తా చాటింది. దాదాపు దశాబ్దం తర్వాత మళ్లీ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్‌ను ఆవిష్కరించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. జర్మనీలోని హాంబర్గ్‌లో జరిగిన అంతర్జాతీయ సూపర్ కంప్యూటింగ్ కాన్ఫరెన్స్‌లో విడుదల చేసిన 'టాప్ 500' జాబితాలో చైనాకు చెందిన 'లైన్‌షైన్' సిస్టమ్ మొదటి స్థానంలో నిలిచింది. దీంతో ఇప్పటివరకు టాప్‌లో ఉన్న అమెరికాకు చెందిన 'ఎల్ క్యాపిటన్' రెండో స్థానానికి పడిపోయింది.
షెన్‌జెన్‌లోని నేషనల్ సూపర్‌కంప్యూటింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఈ లైన్‌షైన్ సిస్టమ్, సెకనుకు 2.198 ఎగ్జాఫ్లాప్‌ల వేగాన్ని నమోదు చేసింది. అమెరికాలోని లారెన్స్ లివర్‌మోర్ నేషనల్ ల్యాబొరేటరీలో ఉన్న ఎల్ క్యాపిటన్ (1.809 ఎగ్జాఫ్లాప్‌లు) కంటే ఇది సుమారు 20-22 శాతం అధికం. 2017లో సన్‌వే టైహులైట్ తర్వాత, చైనా ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవడం ఇదే తొలిసారి. మూడేళ్ల తర్వాత ఈ జాబితాలో అడుగుపెట్టిన చైనా, నేరుగా నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం.

**సొంత టెక్నాలజీతో సత్తా**
అమెరికా టెక్నాలజీ ఆంక్షలు ఎదుర్కొంటున్న తరుణంలో, ఈ లైన్‌షైన్ సూపర్ కంప్యూటర్‌ను పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో నిర్మించడం చైనా సాధించిన అతిపెద్ద విజయంగా భావిస్తున్నారు. ఇందులో కస్టమ్ ఆర్మ్ వీ9 ఆధారిత లింగ్‌కున్ ఎల్‌ఎక్స్2 సీపీయూలు, సొంత ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీ, కైలిన్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఉపయోగించారు. ఇందులో 1.37 కోట్ల కోర్ లు ఉన్నాయి. వాతావరణ మార్పుల అంచనా, ఇంజినీరింగ్, డ్రగ్ డిస్కవరీ, ఏఐ వంటి కీలక రంగాల్లో పరిశోధనలకు ఈ సూపర్ కంప్యూటర్ సేవలు అందిస్తుంది. అయితే, ఈ టాప్ 500 జాబితా కేవలం సంప్రదాయ కంప్యూటింగ్ పనుల వేగాన్ని మాత్రమే కొలుస్తుందని, ఆధునిక ఏఐ సామర్థ్యానికి ఇది సరైన కొలమానం కాదని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ, దేశీయ టెక్నాలజీతో చైనా ఈ ఘనత సాధించడం విశేషం.

# దీర్ఘాయుష్షు గుట్టువిప్పిన శాస్త్రవేత్తలు!



కొంతమంది చాలాకాలం పాటు ఆరోగ్యంగా జీవించడానికి గల రహస్యం వారి జన్యువుల్లోనే దాగి ఉందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. కొన్ని కుటుంబాల్లో వంశపారంపర్యంగా వస్తున్న ఒక అరుదైన జన్యు మార్పు వారిని దీర్ఘాయుష్మంతులుగా, ఆరోగ్యవంతులుగా ఉంచుతున్నట్లు నెదర్లాండ్స్ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ జన్యువు ఉన్నవారిలో గుండె జబ్బులు, మధుమేహం వంటి వ్యాధులు ఇతరులతో పోలిస్తే సగటున 13 ఏళ్లు ఆలస్యంగా వస్తున్నట్లు తేలింది.లీడెన్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్ పరిశోధకుడు పాస్కల్ పుట్టర్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన చేసింది. దీర్ఘకాలం జీవించిన తల్లిదండ్రులున్న 212 కుటుంబాల జన్యువులను విశ్లేషించారు. వీరిలో "సీజీఏఎస్" అనే జన్యువులో ఒక ప్రత్యేకమైన మార్పును కనుగొన్నారు. సాధారణంగా ఈ జన్యువు, కణాల్లోకి వైరస్ వంటివి ప్రవేశించినప్పుడు లేదా కణాలు దెబ్బతిన్నప్పుడు వాపు (ఇన్ ఫ్లమేషన్) ప్రక్రియను ప్రేరేపిస్తుంది. అయితే, దీర్ఘాయుష్షు గల కుటుంబాల్లోని వ్యక్తుల్లో ఈ జన్యువు పూర్తిస్థాయిలో కాకుండా పాక్షికంగా పనిచేస్తోంది. దీనివల్ల అనవసరమైన, దీర్ఘకాలిక వాపు ప్రక్రియ తగ్గుముఖం పడుతోందని, అదే వారి ఆరోగ్య రహస్యమని పరిశోధకులు వివరించారు.
ఈ పాక్షిక పనితీరు వల్ల రోగనిరోధక వ్యవస్థ ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యాన్ని కోల్పోకుండానే, వయసు పెరిగే కొద్దీ వచ్చే దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు తగ్గుతోందని శాస్త్రవేత్తలు తెలిపారు. గోథెన్‌బర్గ్‌లో జరిగిన యూరోపియన్ సొసైటీ ఆఫ్ హ్యూమన్ జెనెటిక్స్ సదస్సులో ఈ ఫలితాలను వెల్లడించారు. అయితే, ఈ జన్యు మార్పు చాలా అరుదైనదని, కేవలం కొన్ని ప్రత్యేక కుటుంబాల్లోనే కనిపించిందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. దీర్ఘాయుష్షుకు జన్యువులతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి, పర్యావరణం వంటి ఇతర అంశాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయని వారు గుర్తుచేశారు.

# ఒక యూట్యూబర్ తీసిన సినిమాకు భారత్‌లో వసూళ్ల వర్షం!



హాలీవుడ్‌లో ఓ చిన్న హారర్ సినిమా బాక్సాఫీస్ వద్ద పెను సంచలనం సృష్టిస్తోంది. 26 ఏళ్ల క్రీ బార్కర్ దర్శకత్వం వహించిన 'అబ్సెషన్' చిత్రం భారత్‌లో ఊహించని విజయాన్ని అందుకుంది. ఈ సినిమా ఇప్పటివరకు మన దేశంలో రూ.79 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, 2026లో అతిపెద్ద హాలీవుడ్ హిట్‌గా నిలిచింది.
కేవలం రూ.7.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా, భారీ అంచనాలతో విడుదలైన 'ప్రాజెక్ట్ హెయిల్ మేరీ' (రూ.75 కోట్లు) వసూళ్లను అధిగమించడం విశేషం. భారత్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన హాలీవుడ్ చిత్రాల జాబితాలో 'అబ్సెషన్' ప్రస్తుతం 28వ స్థానంలో ఉంది. మరో కోటి రూపాయలు వసూలు చేస్తే 'అవెంజర్స్: ఏజ్ ఆఫ్ అల్ట్రాన్' (రూ.80 కోట్లు) రికార్డును కూడా దాటేస్తుంది.
ఒకప్పుడు యూట్యూబర్‌గా ఉండి, దర్శకుడిగా మారిన 26 ఏళ్ల క్రీ బార్కర్ ఈ విజయంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారత్‌లో తన సినిమాకు ఈ స్థాయిలో ఆదరణ లభిస్తుందని తాను ఊహించలేదని అన్నారు. ప్రేక్షకులు సినిమాలోని సన్నివేశాలను రీక్రియేట్ చేస్తూ కామెడీ వీడియోలు చేయడం, ఫ్యాన్ ఆర్ట్ గీయడం వంటివి చూసి షాక్‌కు గురయ్యానని తెలిపారు.ఈ విజయం అల్గారిథమ్‌ల కంటే ఫిలిం మేకర్స్‌పై నమ్మకం పెంచడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు బార్కర్ పేర్కొన్నారు. యువ దర్శకులు మంచి కాంట్రాక్టులు, క్రియేటివ్ కంట్రోల్ సాధించుకోవాలని సూచించారు. కాగా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 334 మిలియన్ డాలర్లకు పైగా వసూలు చేసి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది.

## కేవలం రూ.వెయ్యికే వాటర్ ప్యూరిఫైయర్లు.. వేలకు వేలు ఖర్చు పెట్టాల్సిన పనే లేదు.. బెస్ట్ ఆప్షన్స్ ఇవే..



వాటర్ ప్యూరిఫైయర్ కొనాలంటే రూ.10 వేలపైమాటే. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అది భారంతో కూడుకున్న పని. అయితే ఇప్పుడు అంత ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండా రూ.వెయ్యిలోపు ధరల్లోనే ప్యూరిఫైయర్ సౌకర్యం పొందవచ్చు. ఇందుకోసం మార్కెట్లో అనేక ఎంపికలు అందుబాటులో ఉన్నాయి.వాటర్ క్యాన్లు తెచ్చుకునే కాలం పోయింది. ఇప్పుడు ఎక్కువమంది ఇళ్లల్లో వాటర్ ప్యూరిఫైయర్లు ఉంటున్నాయి. రూ.10 వేల నుంచి వీటి ధరలు ప్రారంభమవుతున్నాయి. మంచి కంపెనీ బ్రాండ్ కావాలంటే రూ. 15 వేల వరకు ఉంటుంది. ఇక కెపాసిటీని బట్టి ఆపై ధరల్లో కూడా లభిస్తున్నాయి. ఇక సిటీలల్లో రెంటల్ బేస్ మీద కూడా వాటర్ ప్యూరిఫైయర్లు అందుబాటులో ఉంటున్నాయి. అద్దె ఇళ్లల్లో ఉండేవారు ఎక్కువగా రెంటల్ వాటర్ ప్యూరిఫైయర్లను ఉపయోగించుకుంటున్నారు. అయితే ఖరీదైన =ూ లేకుండా శుభ్రమైన నీటి కోసం చూస్తున్నారా? ఇందుకోసం అనేక ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి. గ్రావిటీ ఫిల్టర్లు, నాన్-ఎలక్ట్రిక్ ప్యూరిఫైయర్‌ల వంటి =ూ-యేతర పరికరాల ద్వారా రూ.వెయ్యిలోపు ఖర్చుతో మంచినీటి సౌకర్యం పొందవచ్చు.

**గ్రావిటీ వాటర్ ఫిల్టర్**

ఈ పరికరం విద్యుత్ లేకపోయినా పనిచేస్తుంది. నీటిని సహజ పద్ధతిలో శుభ్రపరుస్తూ బ్యాక్టీరియా, దుమ్ము, మురికిని తొలగించడంలో సహాయపడుతుంది. దీని ధర కేవలం రూ. 500 నుండి రూ.1000 మధ్య ఉంటుంది. రోజువారీ ఉపయోగం కోసం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

**విద్యుత్ రహిత నీటి ఫిల్టర్**

ఈ పరికరం విద్యుత్ లేకుండా నీటిని శుద్ధి చేసి దాని రుచిని మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా ుఱూ స్థాయిలను సమతుల్యం చేయడానికి కూడా సహాయపడుతుంది.ౖా+లు, హాస్టళ్లకు ఉత్తమ ఎంపికగా భావిస్తారు.

**ఆరు-పొరల ట్యాప్ ఫిల్టర్**

మీరు ఈ ఫిల్టర్‌ను నేరుగా మీ కుళాయికి అమర్చుకోవచ్చు. ఈ పరికరం నీటిని పలు దశల ద్వారా శుభ్రపరుస్తుంది. నీటిలోని మురికి, సూక్ష్మ కణాలను 6 దశలుగా తొలలగిస్తుంది. రూ.100 నుంచి రూ.300 మధ్య ధరలో ఇది లభిస్తుంది.

**పోర్టబుల్ వాటర్ ప్యూరిఫైయర్**

మీరు ప్రయాణాలకు వెళ్తుంటే ఇది మంచి ఎంపిక. నది లేదా వాగులోని నీటిని వడపోసి శుభ్రపరుస్తుంది. దీనిని తేలికగా, సులభంగా తీసుకెళ్లవచ్చు. ట్రెక్కింగ్, అత్యవసర పరిస్థితులలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీని ధర రూ.వెయ్యిగా ఉంది.

**యాక్టివేటెడ్ కార్బన్ వాటర్ ఫిల్టర్**

ఈ పరికరం నీటిలోని దుర్వాసన, క్లోరిన్, ఇతర మలినాలను తొలగించడంలో సహాయపడుతుంది. ఇది నీటి రుచిని మెరుగుపరుస్తుంది. దీని ధర కూడా చాలా తక్కువ. చిన్న గృహ అవసరాలకు ఇది ఒక సులభమైన, అద్భుతమైన ఎంపికగా చెప్పవచ్చు.




# తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం - ఓటర్ జాబితాపై ఫోకస్



ఓటర్ల జాబితా సవరించడం కోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం జీహెచ్ఎంసీ (గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) పరిధిలో అధికారులు సిద్ధమయ్యారు. సర్ ప్రక్రియలో శుక్రవారం నుంచి జులై 24 వరకు ఇంటింటి గణనకు వచ్చే బీఎల్‌వోలు ఒక కుటుంబంలో ఎంత మంది ఓటర్లు ఉంటే అన్ని ఎన్యుమరేషన్ ఫారాలు విడివిడిగా ఇస్తారు. వీటిని ఓటరు విధిగా తన పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను జత చేసి పుట్టిన తేదీ, ఆధార్ కార్టు నెంబర్, ఫోన్ నెంబర్, తల్లిదండ్రుల వివరాలు, వారి ఓటు హక్కు వివరాలను నింపి అందజేయాల్సి ఉంటుంది. లేదా నేరుగా ఎన్నికల సంఘం యాప్‌లో అప్లోడ్ చేయవచ్చు. ఒకవేళ ఇంటి వద్ద లేని పక్షంలో ఃూజు=ూ.జుజ×.+ూం.×చీ ఫారం డౌన్ లోడ్ చేసుకోవాలని, జూలై 24 లోగా అప్లోడ్ చేసి ఎక్నాలెడ్జిమెంట్‌ను బీఎల్ వోలకు అందజేయాలి. అలా చేసిన ఎన్యూమరేషన్ ఫారమ్స్‌ను బీఎల్ వోలు క్షుణ్ణంగా పరిశీలించి ఓటును నిర్ధారిస్తారు.

**బీఎల్ఏలకు శిక్షణ :** ఇందుకు గాను హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో 4,062 పోలింగ్ స్టేషన్లలో 47,36,669 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో ఇప్పటికే 22 లక్షల 9 వేల 647 మంది ఓటర్లు మ్యాపింగ్ చేశారు. ఇంకా 25 లక్షల 27 వేల 22 మంది ఓటర్లను మ్యాపింగ్ చేయాల్సి ఉంది. వీరందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసేందుకు జిల్లావ్యాప్తంగా 4,062 మంది బీఎల్ వోలను నియమించారు. అలాగే వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన 10,901 మంది బీఎల్ఏలను నియామకం పూర్తి చేసి వారికి తగిన శిక్షణ ఇచ్చారు.

**హైదరాబాద్‌లో ఓటు వేయాలంటే ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు :** ఓఆర్ఆర్ లోపల ఉండే రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లోని ఓటర్ల సమగ్ర సర్వేకు ఆ జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బీఎల్‌వో, బీఎల్ఏలకు శిక్షణ ఇచ్చారు. అయితే తన ఓటు ఎక్కడ ఉంచుకోవాలనేది పూర్తి స్వేచ్ఛ ఓటరుకే ఉందని, అక్కడ మాత్రమే ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వాల్సి ఉందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో చాలా మంది ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన ఓటర్లు ఉన్న వారు ఇంతకు ముందు ఓటు హక్కు వినియోగించుకున్న ప్రాంతంలోనే ఎన్యూమరేషన్ చేసుకోవాలి. తుది ఓటరు జాబితాలో వారి పేరు వచ్చాక ఒక వేళ హైదరాబాద్‌లో ఓటు వేయాలంటే ట్రాన్స్ ఫర్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

# మనసును కదిలించే బంధం: 400 కోతులకు అమ్మగా మారిన 76 ఏళ్ల మాజీ పోలీస్ ఆఫీసర్!

రిటైర్మెంట్ తర్వాత చాలా మంది ప్రశాంతంగా, విశ్రాంతిగా సుఖవంతమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటారు. కానీ, తమిళనాడులోని మదురైకి చెందిన 76 ఏళ్ల మాలతి మాత్రం సమాజానికి, మూగజీవాలకు ఉపయోగపడే ఒక విలక్షణమైన సేవా మార్గాన్ని ఎంచుకున్నారు. గత 10 సంవత్సరాలుగా ప్రతి వారం వందలాది కోతులకు స్వయంగా ఆహారం అందిస్తూ ఆమె వార్తల్లో నిలిచారు. ఈ మాజీ పోలీస్ అధికారిణికి సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.

రిటైర్మెంట్ తర్వాత చాలా మంది ప్రశాంతంగా, విశ్రాంతిగా సుఖవంతమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటారు. కానీ, తమిళనాడులోని మదురైకి చెందిన 76 ఏళ్ల మాలతి మాత్రం సమాజానికి, మూగజీవాలకు ఉపయోగపడే ఒక విలక్షణమైన సేవా మార్గాన్ని ఎంచుకున్నారు. గత 10 సంవత్సరాలుగా ప్రతి వారం వందలాది కోతులకు స్వయంగా ఆహారం అందిస్తూ ఆమె వార్తల్లో నిలిచారు. ఈ మాజీ పోలీస్ అధికారిణికి సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.

మాలతి తమిళనాడు పోలీసు శాఖలో సుదీర్ఘంగా 33 సంవత్సరాల పాటు సేవలందించి, 2010లో పదవీ విరమణ చేశారు. అంతేకాకుండా ఆమె విద్యా రంగంలో కూడా కొంతకాలం పాటు పనిచేశారు. ఉద్యోగ బాధ్యతల నుండి తప్పుకున్న తర్వాత, ఖాళీగా కూర్చోవడం ఇష్టం లేక ఆమె జంతు సంక్షేమంపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే 2015 నుండి స్థానికంగా ఉండే కోతులకు ప్రతి వారం ఆహారం పెట్టడాన్ని ఒక యజ్ఞంలా ప్రారంభించారు.

ప్రతి శనివారం మధ్యాహ్నం అయ్యిందంటే చాలు.. మాలతి తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుప్పరన్‌కుండ్రం పరిసరాల్లోని ఆరు వేర్వేరు ప్రాంతాలను సందర్శిస్తారు. వీటిలో మురుగన్ ఆలయ సముదాయం, శరవణ పొయిగై, పాల్చునైకంద సుబ్రహ్మణ్య ఆలయం, మయిల్ తొప్పు (నెమళ్ల తోట),



గుహాలయం ప్రాంతం, చారిత్రక కోట ప్రాంతం ఉన్నాయి. ఆమె కోతులను పిలవగానే, వందలాది కోతులు ఆమె వద్దకు గుంపుగా వస్తాయి. ఈ ప్రాంతాలలో సుమారు 350 నుండి 400 కోతులు నివసిస్తున్నాయని, అవి ఆమె గొంతును గుర్తిస్తాయని మాట్లాడుతూ చెప్పింది.

ఆమె ఆయా ప్రాంతాలకు చేరుకుని ప్రేమగా పిలవగానే, వందలాది కోతులు చెట్లపై నుండి, కొండలపై నుండి గుంపులు గుంపులుగా ఆమె వద్దకు పరుగెత్తుకు వస్తాయి. గడిచిన పదేళ్లుగా నిరంతరాయంగా చూపిస్తున్న సంరక్షణ వల్ల, మాలతికి ఆ కోతులకు మధ్య ఒక విడదీయరాని ప్రత్యేక బంధం ఏర్పడింది. సాధారణంగా మనుషులను చూస్తే భయపడే లేదా దాడి చేసే కోతులు, ఆమె దగ్గరకు వచ్చేసరికి మాత్రం ఎంతో సాధువులుగా మారిపోతాయి. ఎలాంటి భయం లేకుండా ఆమె చేతుల మీదుగా ఆహారాన్ని అందుకుంటాయి. "ఈ ప్రాంతాలలో సుమారు 350 నుండి 400 కోతులు నివసిస్తున్నాయి. నేను పిలిచే పిలుపును, నా గొంతును అవి స్పష్టంగా గుర్తిస్తాయి" అని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.ప్రస్తుతం 76 ఏళ్ల వయస్సు పైబడటం, కొన్ని వృద్ధాప్య ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నప్పటికీ, మాలతి మాత్రం తన వారాంతపు సేవను ఎక్కడా ఆపడం లేదు. ఈ మూగజీవాలకు సేవ చేయడం వల్ల తనకు ఎనలేని మనశ్శాంతి, ఆత్మసంతృప్తి లభిస్తున్నాయని ఆమె చెబుతున్నారు. ఆ కోతులు తనపై చూపే నిష్కల్మషమైన ప్రేమే తన జీవితంలోని నిజమైన సంపద అని నమ్మే మాలతి, తన ఆరోగ్యం సహకరించినంత కాలం ఈ సేవను ఇలాగే కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఆమె స్ఫూర్తిదాయక ప్రయాణం ఎందరికో ఆదర్శంగా నిలుస్తోంది.

## జాగ్రత్త అండోయ్..ఈ 4 ఆస్తులు మిమ్మల్ని పేదవాళ్లని చేస్తాయ్..

ఆస్తుల వలె కనిపించే అప్పులు మీ ఆర్థిక ఎదుగుదలకు ఎలా అడ్డుపడతాయో తెలుసుకోండి. అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు, ఖరీదైన ఫర్నిచర్, అధిక ధర కార్లు వంటివి సరైన ప్రణాళిక లేకుండా కొంటే ఎలా భారంగా మారతాయో ఈ కథనం వివరిస్తుంది. వ్యక్తిగత ఆర్థిక నిర్వహణలో తెలివైన నిర్ణయాలు తీసుకోవడానికి ఈ ముఖ్యమైన సలహాలను పాటించండి.

చాలామందిని పేదలుగా మార్చే కొన్ని ఆస్తుల గురించి ఆర్థిక నిపుణులు ఏమంటున్నారో ఈ కథనంలో సవివరంగా తెలుసుకుందాం. ఇవి అసెట్స్ లాగా కనిపించే లయబిలిటీస్. చాలామంది వీటిని ఆస్తులుగా భావించి కొనుగోలు చేస్తారని, అయితే అవి కాలక్రమేణా ఆర్థిక భారాన్ని పెంచుతాయని నిపుణులు పేర్కొన్నారు.

1. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ (నివాస ప్రయోజనాల కోసం)

నివసించడానికి కొనే అపార్ట్‌మెంట్ ఫ్లాట్ చాలామందికి అప్పుగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు. లోన్ తీసుకుని దీన్ని కొన్నప్పుడు, ఇది ముఖ్యంగా ఆర్థిక భారాన్ని మోపుతుంది. ఉదాహరణకు, మీరు కోటి రూపాయల ఫ్లాట్ కొని దాన్ని అద్దెకు ఇచ్చినప్పుడు, దాని రెంటల్ యీల్డ్ సగటున 3-5% ఉంటుంది. అంటే నెలకు సుమారు రూ.25,000 నుండి రూ.41,667 వరకు వస్తుంది. ఇది లోన్ వడ్డీకి సరిపోకపోవడమే కాకుండా, పెద్ద మొత్తంలో డబ్బును నిలిపివేస్తుంది. ప్రాపర్టీ విలువ భవిష్యత్తులో పెరుగుతుందని చాలామంది భావిస్తారు. అయితే, అపార్ట్‌మెంట్లలో ల్యాండ్ వాటా తక్కువగా ఉంటుంది. బిల్డింగ్ నిర్మాణానికి, నిర్మాణ వాల్యూకి ఎక్కువ డబ్బు ఖర్చు అవుతుంది. ఒక బిల్డింగ్ జీవితకాలం సగటున 30 నుంచి 60 సంవత్సరాలు ఉంటుంది. కాలక్రమేణా బిల్డింగ్ పాతబడితే, దాని విలువ తగ్గుతుంది. పాత బిల్డింగ్‌లోని ఫ్లాట్‌లకు డిమాండ్ తగ్గి, వాటిని అమ్మడం కష్టం అవుతుంది. అప్పుడు కేవలం ల్యాండ్ వాటా మాత్రమే మిగులుతుంది, ఇది చాలా చిన్నదిగా ఉంటుంది. అందువల్ల, పెట్టుబడి కోసం చూస్తున్నట్లయితే, కన్స్ట్రక్షన్



లేని ల్యాండ్ కొనుగోలు చేయడం మంచిదని, దాని విలువ కాలక్రమేణా పెరుగుతుందని నిపుణులు సూచించారు.

2. ఖరీదైన ఫర్నిచర్

ఇల్లు కొన్న తర్వాత లేదా కట్టిన తర్వాత చాలామంది ఫర్నిచర్‌పై లక్షల్లో ఖర్చు చేస్తారు. ఉదాహరణకు, ఒక 6ఐ6 బెడ్‌కు 2 నుంచి 3 లక్షలు, డైనింగ్ టేబుల్‌కు లక్ష రూపాయలు ఇలా మొత్తం 6-7 లక్షల వరకు ఖర్చు చేస్తుంటారు. హోమ్ లోన్‌తో పాటు ఈ ఫర్నిచర్ కోసం పర్సనల్ లోన్ కూడా తీసుకుంటుంటారు. అయితే, ఫర్నిచర్ విలువ రోజురోజుకూ తగ్గుతుందని, ఇది అస్సలు ఆస్తి కాదని స్పష్టం చేశారు. అప్పు చేసి మరీ విలువ తగ్గే వస్తువులను కొనుగోలు చేయడం ఆర్థికంగా నష్టమని సలహా ఇస్తున్నారు. మీ ఆర్థిక స్తోమతను బట్టి, అవసరానికి తగినట్లుగా ఫర్నిచర్ కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. లక్షలు ఖర్చు చేయకుండా, 70-80 వేలలో మంచి బెడ్‌లు, 30-40 వేలలో మంచి డైనింగ్ టేబుల్స్ లభిస్తాయని ఉదాహరణగా చెప్పారు.

3. కార్లు లేదా బైక్‌లు

ఉద్యోగం వచ్చిన వెంటనే చాలామంది చేసే మొదటి తప్పు కారు లేదా బైక్ కొనుగోలు అని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. మీ వార్షిక ఆదాయానికి మించి ఖరీదైన వాహనాలను కొనుగోలు చేయడం ఆర్థికంగా భారాన్ని పెంచుతుంది. కార్లు, బైక్‌ల విలువ కాలక్రమేణా వేగంగా తగ్గుతుంది. అంతేకాకుండా, నిర్వహణ ఖర్చులు, ఇంధన ఖర్చులు, బీమా, లోన్ వడ్డీ వంటి అదనపు భారాన్ని మోపుతాయి.

మీ స్థాయికి తగ్గట్టుగా, అవసరాన్ని బట్టి వాహనాలను ఎంచుకోవడం ఆర్థికంగా తెలివైన నిర్ణయం. విలాసవంతమైన వాహనాల కోసం భారీ లోన్‌లు తీసుకోవడం వలన మీ ఇతర ముఖ్యమైన పెట్టుబడుల సామర్థ్యం తగ్గిపోతుందని, ఇది దీర్ఘకాలంలో ఆర్థిక నష్టాన్ని కలిగిస్తుందని నిపుణులు వివరించారు.

ఈ విధంగా, ఆస్తులుగా కనిపించే ఈ లయబిలిటీలను గుర్తించి, వాటి పట్ల జాగ్రత్తగా ఉండటం ద్వారా వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికను పటిష్టంగా చేసుకోవచ్చు అని ఆర్థిక నిపుణులు సూచించారు.

## మహిళలకు రైల్వేశాఖ భారీ శుభవార్త..

## రైల్వే స్టేషన్లలో అవి ఫ్రీ.. రూపాయి కూడా చెల్లించనక్కర్లేదు..

రైళ్లల్లో ప్రయాణించే మహిళలకు గుడ్ న్యూస్. ఇక నుంచి రైల్వే స్టేషన్లలో శానిటరీ నాప్‌కిన్ ప్యాడ్లను రైల్వేశాఖ అందుబాటులోకి రానుంది. ఈ మేరకు వెండింగ్ మెషిన్లను ప్రవేశపెట్టింది. ఈ మెషిన్ల ద్వారా శానిటరీ ప్యాడ్లను మహిళలు పొందవచ్చు. రైలు ప్రయాణం చేసే మహిళలకు ఇది పెద్ద ఊరటగా చెప్పవచ్చు.మహిళా ప్రయాణికులకు భారతీయ రైల్వే గుడ్ న్యూస్ తెలిపింది. రైలు ప్రయాణాల సమయంలో మహిళా ప్రయాణికులు రుతుస్రావం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా కీలక ముందుడుగు వేసింది. ఈ మేరకు రైల్వే స్టేషన్లలో ఉచిత శానిటరీ నాప్‌కిన్ ప్యాడ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకోసం అతిపెద్ద టెలికాం మౌలిక సదుపాయాల సంస్థ ఇండస్ టవర్స్‌తో రైల్వేశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా తొలి విడతలో దేశవ్యాప్తంగా కొన్ని రైల్వే స్టేషన్లల్లో 500 శానిటరీ నాప్‌కిన్ వెండింగ్ మెషీన్లను నెలకొల్పింది. ఢిల్లీ, లక్నో, అంబాలా, ఫిరోజ్‌పూర్, మొరాదాబాద్ డివిజన్‌లలోని 175 రైల్వే స్టేషన్లలో ఈ మెషిన్లను ఏర్పాటు చేశారు. ఈ శానిటరీ నాప్‌కిన్‌లు రోజుకు 24 గంటలూ ఉచితంగా అందుబాటులో ఉంటాయి.

మహిళలకు ఊరట..

ఇండస్ టవర్స్ "నారీ సమ్మాన్" అనే సీఎస్ఆర్ కార్యక్రమం కింద ఈ మెషీన్లను ప్రవేశపెట్టగా.. ఇప్పటివరకు 3 కోట్లకుపైగా నాప్‌కిన్‌లు పంపిణీ చేశారు. రైల్వే ప్రయాణాల సమయంలో మహిళలకు శానిటరీ ప్యాడ్‌లు లభించడం లేదు. దీని వల్ల రుతుస్రావం సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్లలో అందుబాటులో లేకపోవడం వల్ల అసౌకర్యానికి గురవుతున్నా. ఈ సమస్యను పరిష్కరించేందుకు రైల్వేశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఇండస్ టవర్స్ తమ జూ= కార్యక్రమం "ప్రగతి" కింద ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. భారత ప్రభుత్వ జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఉన్న "ఋతు పరిశుభ్రత పథకం" లక్ష్యాలకు అనుగుణంగా ఈ కార్యక్రమం నడుస్తోంది. ఈ అత్యాధునిక యంత్రాలు సాంకేతికతతో పనిచేస్తాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (×శీ) టెక్నాలజీతో వీటిని అనుసంధానించారు. మెషీన్‌లో శానిటరీ ప్యాడ్‌లు అయిపోకముందే కంట్రోల్ రూమ్‌కు ఒక హెచ్చరిక అందుతుంది. స్టేషన్‌లో అన్ని వేళలా ప్యాడ్‌లు అందుబాటులో ఉంచేందుకు ఇది సహాయపడుతుంది. యంత్రాల కొరతను నివారించేందుకు ఈ వ్యవస్థ బాగా ఉపయోగపడుతుంది. రైళ్లల్లో ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్తున్నారు. వీళ్లల్లో మహిళలు, బాలికలు ఎక్కువమంది ఉంటున్నారు. దీంతో మహిళలకు ప్రయోజనం చేకూర్చేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని రైల్వేశాఖ భావిస్తోంది.

2030 నాటికి..

దేశంలో అత్యంత రద్దీగా ఉండే ప్రజా రవాణా నెట్‌వర్క్‌లో రైల్వేలు ఒకటి. దీంతో ఇటువంటి సౌకర్యాన్ని అందించడం ఒక పెద్ద బాధ్యత అని ఇండస్ టవర్స్ సంస్థ తెలిపింది.

సాంకేతికత ఆధారిత పరిష్కారాలను అందించడంలో తమ కంపెనీకి విస్తృతమైన అనుభవం ఉందని, ఆ అనుభవాన్ని ఇప్పుడు సామాజిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఉపయోగిస్తున్నామని స్పష్టం చేసింది. 2030 నాటికి 15 కోట్ల మందికి పైగా ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే తమ కంపెనీ లక్ష్యమని పేర్కొంది.

## కేసు వదిలిలేద్దామనుకున్నారు.. కట్‌చేస్తే.. డాగ్ స్క్వాడ్ ఎంట్రీతో మారిన సీన్.. చిన్న గుడ్డ ముక్కతో..




యూపీలో సంచలనం సృష్టించిన ఒక చిన్నారిపై లైంగిక దాడి కేసులో ఓ శునకం చేసిన పని కేసు స్వరూపాన్నే మలుపు తిప్పింది. నిందితుడిని గుర్తించేందుకు పోలీసులకు ఎలాంటి క్లూ దొరకపోవడంతో.. అంతా అయిపోంది అనుకునే టైంలో ఎంట్రీ ఇచ్చిన ఓ శునకం కేసును ఊహించని మలుపు తిప్పింది. పోలీసులు చూపించిన ఓ చిన్న గుడ్డ ముక్క స్మెల్ సహాయంతో ఆ శునకం ఏకంగా నిందితుడినే పట్టించింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

ఆదో లైంగిక దాడి కేసు.. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులకు ఎలాంటి క్లూ దొరకట్లేదు. ఇక చేసేదేమి లేదో కేస్ క్లోజ్ చేయాలనే స్టేజ్ వచ్చారు పోలీసులు.. కట్‌చేస్తే.. రంగంలోకి వచ్చిన పోలీస్ గాడ్ కేసు స్వరూపాన్నే మార్చేసింది. ఓ చిన్న గుడ్డముక్క సహాయంతో ఏకంగా నిందితుడినే పట్టించింది. ఈ ఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. బాబ్రాలా పరిధిలో జూన్ 19న ఈ అమానుష ఘటన వెలుగుచూసింది. ఆరేళ్ల బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అయితే ఈ ఘటన తర్వాత బాలిక తీవ్ర అస్వస్థతకు గురవ్వడాన్ని గమనించిన తల్లి వెంటనే విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది.

పోలీసులకు దొరకని క్లూ

అయితే, ఈ ఘటనతో తీవ్రంగా బయపడిపోయిన ఆ చిన్నారి తనపై ఎవరు, ఎలా దాడి చేశారనే విషయాన్ని పోలీసులకు స్పష్టంగా చెప్పలేకపోయింది. ఇక తల్లి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. స్థానికంగా ఏవైనా ఆధారాలు దొరుకుతాయేమోనని తీవ్రంగా వెతికారు. కానీ వారికి ఎలాంటి క్లూ దొరకలేదు. స్థానికులను విచారించినా ఎలాంటి ఫలితం లేకపోయింది. చివరకు కేస్‌ను క్లోజ్ చేసే పరిస్థితి వచ్చింది. ఈ క్రమంలోనే జిల్లా డాగ్ స్క్వాడ్ సహాయం తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

సీన్‌లోకి వచ్చిన 'మేరీ':

అప్పుడే సీన్‌లోకి కే-9 విభాగానికి చెందిన 'మేరీ' అనే డాగ్ ఎంట్రీ ఇచ్చింది. పోలీసులు చూపించిన ఒక చిన్న గుడ్డ ముక్క వాసన ఆధారంగా నిందితుడిని గుర్తించే పనిలో పడింది. స్మెల్ చూడగానే వెంటనే అలర్ట్ అయిన మేరీ, అక్కడి ముందుకు కదలడం స్టార్ట్ చేసింది. అలా ముందుకు వెళ్తూ.. ఒక ఊర్లోకి వెళ్లింది. అక్కడ వీధుల గుండా వెళ్తూ నేరుగా ఒక ఇంటి ముందుకు వెళ్లి ఆగి.. అక్కడ గట్టిగా మొరగడం స్టార్ట్ చేసింది.దీంతో ఇంట్లో ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. తమదైన స్టైల్‌లో విచారించగా అసలు విషయం బయటకు వచ్చింది. ఈ నేరానికి పాల్పింది తానేనని నిందితుడు ఒప్పుకున్నట్టు పోలీసులు తెలిపారు.

మేరీపై ప్రశంసలు

దీంతో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇక ఈ ఘటనపై పోలీసులు అధికారులు మాట్లాడుతూ.. నిందితుడిని గుర్తించడం కష్టంగా మారినప్పుడు మేరీ తమకు కొండంత అండగా నిలిచిందని.. అది చూపిన ఆధారంతోనే నిందితుడిని పట్టుకోగలిగామని పోలీసులు తెలిపారు. సకాలంలో స్పందించి కేసును చేధించడంలో కీలక పాత్ర పోషించిన లాబ్రడార్ 'మేరీ'పై పోలీస్ శాఖతో పాటు స్థానికులు ప్రశంసల వర్షం కురిపించారు.

## వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి శుభవార్త - అద్దె ప్రాతిపదికన ఆర్‌టీసీ వ్యాపార సముదాయాలు



: వ్యాపార విస్తరణకు టీజీఎస్ఆర్‌టీసీ గోల్డెన్ ఛాన్స్ కల్పిస్తోంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఆర్‌టీసీ కమర్షియల్ కాంప్లెక్స్‌లను అద్దెకు ఇచ్చేందుకు సంస్థ నిర్ణయించింది. దీనికోసం ఆన్‌లైన్‌లోనే ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. పారదర్శకమైన నిబంధనలు, లీజు పద్ధతుల ద్వారా ఈ స్థలాలను కేటాయించనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ కోరుతోంది.ఆదాయం పెంచుకునే దిశగా అడుగులు : ఎప్పటికప్పుడు సరికొత్త ప్రయాణ అనుభూతులతో దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తాజాగా వ్యాపార రంగంలోనూ వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టింది. కేవలం ప్రయాణికులను చేరవేయడమే కాకుండా, సంస్థ పరిధిలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆదాయాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్‌టీసీ వ్యాపార సముదాయాలను (కమర్షియల్ కాంప్లెక్స్)లను అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు సంస్థ సిద్ధమైంది.

కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి, తమ సంస్థలను విస్తరించుకోవాలనుకునే వారికి ఇది ఒక అద్భుత అవకాశంగా నిలవనుంది.

అన్ని రకాల వ్యాపారాలకు అనువైన వేదికలు : సాధారణంగా ఏ వ్యాపారానికైనా కస్టమర్ల రాక అనేది అత్యంత కీలకం. ఆర్‌టీసీ బస్టాండ్లు, కాంప్లెక్స్‌లు నిరంతరం ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. ప్రతిరోజూ లక్షలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే ఈ ప్రాంతాల్లో వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల, ప్రచార ఖర్చులు లేకుండానే వ్యాపారస్తులకు కస్టమర్లు లభిస్తారు. హోటళ్లు, ఫుడ్ కోర్టులు, సూపర్ మార్కెట్లు, బ్రాండెడ్ షోరూమ్‌ల నుంచి చిన్న తరహా దుకాణాల వరకు అన్ని రకాల వ్యాపారాలకు ఆర్‌టీసీ కమర్షియల్ కాంప్లెక్స్‌లు అనువైన వేదికలుగా మారనున్నాయి. సంస్థను లాభాల బాట పట్టించడంతో పాటు స్థానిక నిరుద్యోగులకు, వ్యాపారస్తులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉన్నతాశయంతో టీజీఎస్ఆర్‌టీసీ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. పారదర్శకమైన నిబంధనలు, లీజు పద్ధతుల ద్వారా ఈ స్థలాలను కేటాయించనున్నారు.

# మెహ్రాంగ్ బలోచ్‌కు యావజ్జీవ శిక్ష.. పాకిస్తాన్ తీర్పుపై భగ్గుమన్న బలూచ్ సమాజం..!





పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌కు చెందిన ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త మెహ్రాంగ్ బలోచ్‌కు క్వెట్టాలోని ఉగ్రవాద నిరోధక న్యాయస్థానం (ఊజ) యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. 2024 జులైలో జరిగిన ఒక భారీ నిరసన ప్రదర్శనలో పారామిలిటరీ సైనికుడిని హత్య చేసినందుకు, అలాగే ఉగ్రవాద సంబంధిత ఆరోపణలపై కోర్టు ఆమెను దోషిగా నిర్ధారించింది. 2025 మార్చి నుంచి కస్టడీలోనే ఉన్న మెహ్రాంగ్‌కు విధించిన ఈ శిక్ష ప్రస్తుతం పాకిస్తాన్‌లో మానవ హక్కులు, అక్కడి న్యాయ ప్రక్రియ విశ్వసనీయతపై తీవ్ర చర్చకు దారితీసింది.

పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌కు చెందిన ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త మెహ్రాంగ్ బలోచ్‌కు క్వెట్టాలోని ఉగ్రవాద నిరోధక న్యాయస్థానం (ఊజ) యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. 2024 జులైలో జరిగిన ఒక భారీ నిరసన ప్రదర్శనలో పారామిలిటరీ సైనికుడిని హత్య చేసినందుకు, అలాగే ఉగ్రవాద సంబంధిత ఆరోపణలపై కోర్టు ఆమెను దోషిగా నిర్ధారించింది. 2025 మార్చి నుంచి కస్టడీలోనే ఉన్న మెహ్రాంగ్‌కు విధించిన ఈ శిక్ష ప్రస్తుతం పాకిస్తాన్‌లో మానవ హక్కులు, అక్కడి న్యాయ ప్రక్రియ విశ్వసనీయతపై తీవ్ర చర్చకు దారితీసింది.

క్వెట్టా ఉగ్రవాద నిరోధక న్యాయస్థానం మెహ్రాంగ్ బలోచ్‌తో పాటు ఆమె సహచరుడు సిబ్ఘతుల్లాను కూడా ఈ కేసులో దోషులుగా ప్రకటించింది. న్యాయస్థానం వెల్లడించిన వివరాల ప్రకారం.. జులై 2024లో గ్వాదర్‌లో జరిగిన ఒక నిరసన ప్రదర్శన సందర్భంగా అక్కడ విధుల్లో ఉన్న పారామిలిటరీ సైనికుడు సిపాయి షబీర్ బలోచ్ దారుణ హత్యకు గురయ్యాడు. భద్రతా దళాలపై దాడికి దిగాలంటూ మెహ్రాంగ్ బలోచ్ నిరసనకారులను తీవ్రంగా రెచ్చగొట్టారని కోర్టు నిర్ధారించింది. ప్రాసిక్యూషన్ సమర్పించిన ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, వైద్యపరమైన ఆధారాలు బలోచ్‌పై ఉన్న ఆరోపణలను నిజమని నిరూపిస్తున్నాయని కోర్టు తన తీర్పులో పేర్కొంది.బలూచిస్తాన్‌లో దశాబ్దాలుగా జరుగుతున్న బలవంతపు అకృత్యాలు, మిలిటరీ అరాచకాలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై మెహ్రాంగ్ బలూచ్ అంతర్జాతీయ స్థాయిలో గళం విప్పుతున్నారు. ఈ నేపథ్యంలో ఆమెకు శిక్ష పడటంపై మానవ హక్కుల కార్యకర్తలు మండిపడుతున్నారు. నిందితులను జైలు నుంచే వీడియో లింక్ ద్వారా కోర్టు విచారణకు హాజరు కావాలని ఒత్తిడి చేయడంతో, వారు ఈ విచారణను పూర్తిగా బహిష్కరించారని కార్యకర్తలు విమర్శించారు. బలూచ్ యక్జహతి కమిటీ ఆర్గనైజర్ అయిన లాలా అబ్దుల్ బలూచ్, ఈ విచారణను ఒక “ముఖం లేని విచారణ” అని అభివర్ణించారు. ఈ ఏకపక్ష నిర్ణయం బలూచ్ సమాజానికి, పాక్ ప్రభుత్వానికి మధ్య ఉన్న నమ్మకాన్ని మరింతగా దెబ్బతీస్తుందని, ప్రాంతీయ నిరసనలను మరింతగా రెచ్చగొడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

మరోవైపు బలూచిస్తాన్ ప్రభుత్వం ఈ తీర్పును పూర్తిగా స్వాగతించింది. విధి నిర్వహణలో ఉంటూ ప్రాణాలు కోల్పోయిన సైనికుడు షబీర్ బలూచ్ కుటుంబానికి ఎట్టకేలకు న్యాయం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగ్టి వ్యాఖ్యానించారు. శాంతియుత నిరసనల ముసుగులో హింసను ప్రేరేపించడం, ప్రభుత్వ అధికారులను లక్ష్యంగా చేసుకోవడం ముమ్మాటికీ ఉగ్రవాదమేనని ఆయన స్పష్టం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారు ఎంతటి వారైనా ఉగ్రవాద నిరోధక చట్టాల కింద కఠిన చర్యలు తప్పవని ఈ తీర్పు నిరూపించిందని ప్రభుత్వం పేర్కొంది.

ఈ అన్యాయమైన తీర్పును తాము అంగీకరించబోమని, దీనిని త్వరలోనే బలూచిస్తాన్ హైకోర్టులో సవాలు చేస్తామని మెహ్రాంగ్ బలూచ్ తరపు న్యాయవాది ఇస్రార్ జట్టక్ వెల్లడించారు. కాగా, ఈ తీర్పుకు నిరసనగా బలూచ్ యక్జహతి కమిటీ రాష్ట్రవ్యాప్తంగా పూర్తి స్థాయి సమ్మెకు పిలుపునిచ్చింది. దీనితో బలూచిస్తాన్‌లోని పలు ప్రాంతాలలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# భారత్-అమెరికా-మధ్య ఆసియా సహకారానికి కొత్త దారులు.. ట్రంప్ బ్రాండెడ్ ప్రాజెక్టులపై చర్చలు






హైదరాబాద్‌లో జరిగిన అమెరికా స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ డా నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్, భారత్‌లోని అమెరికా రాయబారి సెర్జియో గోర్‌ను కలిశారు. ఈ సమావేశంలో కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్గిజిస్తాన్ దేశాల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు, విలాసవంతమైన గోల్ఫ్ కమ్యూనిటీలు, బ్రాండెడ్ రెసిడెన్సీలు, అంతర్జాతీయ స్థాయి అభివృద్ధి ప్రాజెక్టుల అవకాశాలపై చర్చించారు. మధ్య ఆసియాలో ప్రపంచ స్థాయి ప్రాజెక్టుల అభివృద్ధికి వ్యూహాత్మక సహకారంపై ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నారు.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కజకిస్తాన్ గౌరవ కాన్సుల్‌గా వ్యవహరిస్తున్న ప్రముఖ పారిశ్రామికవేత్త, హీూఖ్రాతీశీయవష్ఠం ప్రైవేట్ లిమిడ్ ప్రమోటర్, మేనేజింగ్ డైరెక్టర్ డా. నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ అమెరికా స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా భారత్‌లోని అమెరికా రాయబారి, దక్షిణ, మధ్య ఆసియా ప్రత్యేక ప్రతినిధి సెర్జియో గోర్‌ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మధ్య ఆసియా దేశాలైన కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్గిజిస్తాన్‌లలో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ట్రంప్ ఇంటర్నేషనల్ గోల్ఫ్ క్లబ్, ట్రంప్ టవర్, జాకబ్ అండ్ కో వంటి ప్రముఖ బ్రాండ్ల భాగస్వామ్యంతో విలాసవంతమైన గోల్ఫ్ కమ్యూనిటీలు, బ్రాండెడ్ రెసిడెన్సీలు, మిశ్రమ వినియోగ జీవనశైలి ప్రాజెక్టుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.

భారత్‌లో అత్యున్నత ప్రమాణాలతో కూడిన నివాస ప్రాజెక్టుల అభివృద్ధిలో హీూఖ్రాతీశీయవష్ఠంకు ఉన్న అనుభవాన్ని ప్రస్తావించిన డా. నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే, పర్యాటక రంగానికి ఊతమిచ్చే, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడే ప్రపంచ స్థాయి ప్రాజెక్టులను మధ్య ఆసియాలో అభివృద్ధి చేయాలనే తన దూరదృష్టిని వివరించారు. ప్రతిపాదిత ప్రాజెక్టులు, పెట్టుబడి అవకాశాలు, వ్యూహాత్మక భాగస్వామ్యాలపై మరింత చర్చించేందుకు త్వరలో న్యూఢిల్లీలోని అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో మరోసారి సమావేశం కానున్నట్లు డా ఖాన్ తెలిపారు. ఈ భేటీ భారత్, అమెరికా, మధ్య ఆసియా దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య సహకారం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కుప్పకూలిన గిడ్డంగి పైకప్పు.. కూరుకుపోయిన 60 మంది కార్మికులు.. రంగంలోకి సైన్యం!



పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో బుధవారం మధ్యాహ్నం (జూన్ 24, 2026) ఘోర ప్రమాదం సంభవించింది. పశ్చిమ కోల్‌కతాలోని తారతలా ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఒక భారీ గిడ్డంగి (ఝొతీవష్ట్రశీబంవ) అకస్మాత్తుగా కూలిపడింది. ఈ దుర్ఘటనలో దాదాపు 50 నుంచి 60 మంది కార్మికులు శిథిలాల కింద కూరుకుపోయినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు ఇప్పటివరకు తొమ్మిది మందిని రక్షించి ఎస్ఎస్‌కెఎం (ూాఖవీ) ఆసుపత్రికి తరలించగా, వారిలో ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది.పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో బుధవారం మధ్యాహ్నం (జూన్ 24, 2026) ఘోర ప్రమాదం సంభవించింది. పశ్చిమ కోల్‌కతాలోని తారతలా ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఒక భారీ గిడ్డంగి (ఝొతీవష్ట్రశీబంవ) అకస్మాత్తుగా కూలిపడింది. ఈ దుర్ఘటనలో దాదాపు 50 నుంచి 60 మంది కార్మికులు శిథిలాల కింద కూరుకుపోయినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు ఇప్పటివరకు తొమ్మిది మందిని రక్షించి ఎస్ఎస్‌కెఎం (ూాఖవీ) ఆసుపత్రికి తరలించగా, వారిలో ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది.

కోల్‌కతా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తారతలా ప్రాంతంలోని బ్రేస్ బ్రిడ్జ్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌పోర్ట్ డిపో రోడ్డుపై ఈ గిడ్డంగి నిర్మాణం జరుగుతోంది. బుధవారం మధ్యాహ్నం కార్మికులు ఎప్పటిలాగే తమ పనుల్లో నిమగ్నమై ఉండగా, ఒక్కసారిగా గిడ్డంగి పైకప్పులోని అత్యధిక భాగం భారీ శబ్దంతో కుప్పకూలిపోయింది. లోపల ఇనుప దూలాలు, సిమెంట్ కాంక్రీట్ దిమ్మెలు కార్మికులపై పడటంతో అక్కడ తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ ప్రమాదం ఎంత ఆకస్మికంగా జరిగిందంటే, కార్మికులకు ప్రాణాలు కాపాడుకోవడానికి పరుగెత్తే సమయం కూడా దొరకలేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

రంగంలోకి సైన్యం.. యుద్ధప్రతిపాదికన సహాయక చర్యలు

ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే కోల్‌కతా పోలీసులు, విపత్తు నిర్వహణ బృందం, పౌర రక్షణ, అగ్నిమాపక, అత్యవసర సేవల బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. పరిస్థితి తీవ్రతను బట్టి సైనిక అధికారులను కూడా రప్పించారు. కూలిపోయిన భారీ ఇనుప దూలాలను, కాంక్రీట్ శిథిలాలను తొలగించడానికి పెద్ద ఎత్తున క్రేన్‌లు, అత్యాధునిక యంత్రాలను మోహరించి యుద్ధప్రతిపాదికన సహాయక చర్యలు చేపడుతున్నారు.

ఐదుగురు మృతి చెందారని ప్రకటించిన బీజేపీ నేత!

ఈ ప్రమాదంలో ఇప్పటికే ఐదుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారని బీజేపీ నాయకుడు రాకేష్ సింగ్ మీడియాకు తెలిపారు. “ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు” అని ఆయన పేర్కొన్నారు. అయితే, మరణాల సంఖ్యపై ప్రభుత్వం లేదా జిల్లా యంత్రాంగం నుండి ఇంకా ఎలాంటి అధికారిక ధృవీకరణ వెలువడలేదు. మరోవైపు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మరోవైపు, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర మంత్రి ఇంద్రనీల్ ఖాన్ సంఘటనా స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “లోపల చిక్కుకున్న ప్రతి ఒక్కరినీ సురక్షితంగా రక్షించడమే మా మొదటి ప్రాధాన్యత. అయితే ఈ నిర్మాణం పూర్తిగా చట్టవిరుద్ధంగా జరిగింది. గతంలో టీఎంసీ అధికారంలో ఉన్న సమయంలో దీనికి అనుమతులు ఇచ్చారు” అంటూ ఆరోపించారు. ఈ ఘోర ప్రమాదంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఇది భారత్ కాదు బాసూ.. చైనా! మెరిసే బుల్లెట్ రైళ్ల వెనుక ఉన్న అసలు నిజం ఇదేనా?





మనం తరచుగా చైనా బుల్లెట్ రైళ్లు, తళతళలాడే రైల్వే స్టేషన్లు, మరియు వారి అత్యాధునిక సాంకేతికత గురించి గొప్పగా వింటూ ఉంటాం. కానీ, ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్న ఒక వీడియో మాత్రం దీనికి పూర్తిగా భిన్నమైన, నమ్మలేని చిత్రాన్ని ప్రపంచం ముందుకు తెచ్చింది. ఈ వైరల్ క్లిప్ చైనా రైల్వే వ్యవస్థపై ఇంటర్నెట్‌లో సరికొత్త చర్చను రేకెత్తించింది.

మనం తరచుగా చైనా బుల్లెట్ రైళ్లు, తళతళలాడే రైల్వే స్టేషన్లు, మరియు వారి అత్యాధునిక సాంకేతికత గురించి గొప్పగా వింటూ ఉంటాం. కానీ, ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్న ఒక వీడియో మాత్రం దీనికి పూర్తిగా భిన్నమైన, నమ్మలేని చిత్రాన్ని ప్రపంచం ముందుకు తెచ్చింది. ఈ వైరల్ క్లిప్ చైనా రైల్వే వ్యవస్థపై ఇంటర్నెట్‌లో సరికొత్త చర్చను రేకెత్తించింది.ఈ వీడియోను సంజన్ కుమార్ అనే భారతీయ యాత్రికుడు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా -ఏజూష్ట్రఅతీంవ్‌తీుజవశ్రీ-లో పంచుకున్నారు. చైనాలోని ఒక లోకల్ రైలులో ప్రయాణిస్తున్నప్పుడు ఆయన ఈ దృశ్యాన్ని కెమెరాలో బంధించారు. వీడియోలో జనరల్ కంపార్ట్‌మెంట్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయి కనిపించింది. కనీసం కూర్చోవడానికి సీట్లు లేకపోవడంతో చాలా మంది నిలబడి ప్రయాణించగా, మరికొందరు నేలపై, చివరికి టాయిలెట్ దగ్గర కూడా కూర్చోవలసి వచ్చింది.

ఈ వీడియో ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైన వెంటనే, ముఖ్యంగా భారతీయ నెటిజన్లు దీనిని భారతదేశంలోని ప్యాసింజర్, జనరల్ కంపార్ట్‌మెంట్లతో పోల్చడం ప్రారంభించారు. “ఇది అచ్చం మన దేశంలోని పరిస్థితిలాగే ఉంది” అని పలువురు వ్యాఖ్యానించారు. ప్రపంచానికి తన అపారమైన ప్రగతి గురించి గొప్పలు చెప్పుకునే చైనాలో కూడా సామాన్య ప్రజలు ఇలాంటి కష్టాలనే ఎదుర్కొంటున్నారని ప్రజలు ఎత్తి చూపుతున్నారు.ప్రతి దేశానికి దాని స్వంత క్షేత్రస్థాయి వాస్తవాలు ఉంటాయని, కేవలం వెలుపలి ఆడంబరాన్ని చూసి పూర్తి నిజాన్ని అంచనా వేయలేమని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. చైనా వంటి కఠినమైన నిబంధనలు ఉన్న దేశంలో ఇలాంటి వీడియోలు తీయడం సున్నితమైన విషయమని, కాబట్టి సదరు యాత్రికుడు జాగ్రత్తగా ఉండాలని కొందరు యూజర్లు సలహా ఇచ్చారు.

అయితే, చైనా ప్రపంచంలోనే అతిపెద్ద హై-స్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. ఇక్కడి బుల్లెట్ రైళ్లు గంటకు 300 కిలోమీటర్లకు పైగా వేగంతో దూసుకెళ్తాయి. అయినప్పటికీ, అక్కడ సాధారణ ప్యాసింజర్ రైళ్లు ఇప్పటికీ నడుస్తున్నాయి. చైనాలోని పేద కార్మికులు, విద్యార్థులు, చిన్న నగరాల నివాసితులకు బుల్లెట్ రైళ్ల టికెట్ ధరలు భారంగా మారుతుంటాయి. అందుకే వారు ఈ సాధారణ రైళ్లపైనే ఆధారపడతారు. బుల్లెట్ రైళ్లు కేవలం ప్రధాన మెట్రో నగరాలను వేగంగా కలుపుతాయి, కానీ ఈ లోకల్ రైళ్లు చిన్న చిన్న పట్టణాలు, పల్లెలను అనుసంధానిస్తూ సామాన్యుల రోజువారీ అవసరాలను తీరుస్తాయి. ఈ వీడియో ద్వారా అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వర్గ వ్యత్యాసాలు, సామాన్యుల రవాణా కష్టాలు ఎలా ఉంటాయో స్పష్టంగా అర్థమవుతోంది.

# పూజ కోసం వెళ్తే ప్రాణాలు తీసిన గంగమ్మ.. ఒకరిని కాపాడబోయి.. ఐదుగురూ జలసమాధి!



బీహార్‌లోని ముంగేర్ జిల్లాలో బుధవారం (జూన్ 24) అత్యంత ఘోర ప్రమాదం సంభవించింది. వసుదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్యాంపూర్ గంగా ఘాట్‌లో స్నానానికి వెళ్లిన ఐదుగురు బాలికలు అకస్మాత్తుగా నదిలోని లోతైన నీటిలోకి జారిపోయి మునిగిపోయారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కాచెల్లెళ్లు ఉండటం ఈ విషాదాన్ని మరింత తీవ్రం చేసింది. ఈ ఊహించని ఘటనతో ఘాట్ వద్ద ఒక్కసారిగా గందరగోళం, ఆర్తనాదాలు చెలరేగగా, శ్యాంపూర్ గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది.బీహార్‌లోని ముంగేర్ జిల్లాలో బుధవారం (జూన్ 24) అత్యంత ఘోర ప్రమాదం సంభవించింది. వసుదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్యాంపూర్ గంగా ఘాట్‌లో స్నానానికి వెళ్లిన ఐదుగురు బాలికలు అకస్మాత్తుగా నదిలోని లోతైన నీటిలోకి జారిపోయి మునిగిపోయారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కాచెల్లెళు ఉండటం ఈ విషాదాన్ని మరింత తీవ్రం చేసింది. ఈ ఊహించని ఘటనతో ఘాట్ వద్ద ఒక్కసారిగా గందరగోళం, ఆర్తనాదాలు చెలరేగగా, శ్యాంపూర్ గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది.స్థానిక సమాచారం ప్రకారం, శ్యాంపూర్ గ్రామానికి చెందిన క్రాంతి పాశ్వాన్ ఇంట్లో ఒక పవిత్రమైన పూజ కార్యక్రమం జరుగుతోంది. పూజ నిమిత్తం ఉదయాన్నే పవిత్ర గంగానదిలో స్నానం ఆచరించేందుకు క్రాంతి పాశ్వాన్ నలుగురు కుమార్తెలు సంగీత కుమారి (18), బినీతా కుమారి (16), సంధ్యా కుమారి (14), సోనమ్ కుమారి (12) బయలుదేరారు. వీరితో పాటు అదే గ్రామానికి చెందిన చమక్ లాల్ పాశ్వాన్ కుమార్తె హీనా కుమారి (19) కూడా కలిసి శ్యాంపూర్ ఘాట్‌కు వెళ్ళారు. అందరూ ఎంతో ఉల్లాసంగా నదిలోకి దిగారు. కానీ అదే వారి చివరి ప్రయాణం అవుతుందని ఎవరూ ఊహించలేదు.అమ్మాయిలందరూ గంగా నదిలో స్నానం చేస్తుండగా, వారిలో ఒకరు అకస్మాత్తుగా నది అడుగున ఉన్న లోతైన గుంత, సుడిగుండం వైపు జారిపోయింది. ఆమె నీటిలో మునిగిపోతూ ప్రాణాల కోసం కొట్టుమిట్టాడటం చూసి, మిగిలిన నలుగురు అమ్మాయిలు ఆమెను రక్షించేందుకు ఒకరినొకరు పట్టుకుంటూ ముందుకు పరుగెత్తారు. అయితే, ఆ సమయంలో గంగానదిలో ప్రవాహం చాలా బలంగా ఉంది.బలమైన నీటి ఉధృతికి వారు తట్టుకోలేకపోయారు. ఒక్కొక్కరిగా ఆ ఐదుగురు అమ్మాయిలు ఆ లోతైన నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఈ సంఘటన ఎంత అకస్మాత్తుగా జరిగిందంటే, ఘాట్ వద్ద ఉన్న ఇతర జనం తేరుకుని వారిని రక్షించే అవకాశం కూడా లభించలేదు. కొందరు స్థానికులు వెంటనే నదిలోకి దూకి కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ, నది లోతు, వేగం కారణంగా వారి ప్రయత్నాలు విఫలమయ్యాయి. నిమిషాల వ్యవధిలోనే ఆ ఐదుగురు బాలికలు అందరి కళ్ల ముందే నీటిలో మునిగి అదృశ్యమయ్యారు.ఈ ఘోర ప్రమాద వార్త తెలియగానే వారి కుటుంబాలు కుప్పకూలిపోయాయి. క్రాంతి పాశ్వాన్ దంపతులు ఒకేసారి తమ నలుగురు కుమార్తెలను కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

# సియా గోయల్- చేతన్ మధ్య

# 2004 ఫోన్ కాల్స్.. 238 గంటల సంభాషణ



పుణెలో సంచలనం సృష్టించిన బిజినెస్‌మెన్ కుమారుడు కేతన్ హత్య కేసులో షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయి. కాబోయే భార్య సియా గోయల్.. తన ప్రియుడు చేతన్‌తో కలిసి పక్కా ప్లాన్ ప్రకారం కేతన్‌ను హత్య చేసినట్టు పోలీసులు తేల్చారు. సీసీ ఫుటేజ్, ఫోన్ కాల్ డేటా, కుటుంబ సభ్యుల ఫిర్యాదులతో ఈ మర్డర్ మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఒక్కో ఆధారం బయటపడుతున్న కొద్దీ నిందితుల కుట్ర మరింత స్పష్టమవుతోంది.

పుణెలో బిజినెస్‌మెన్ కుమారుడు కేతన్ హత్య కేసు అనూహ్య మలుపులు తిరుగుతోంది. తొలుత ప్రమాద మరణంగా కనిపించిన ఈ ఘటన వెనుక ప్రేమ, మోసం, ముందస్తు కుట్ర దాగి ఉన్నట్టు పోలీసులు నిర్ధారించారు. కాబోయే భార్య సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ కలిసి కేతన్‌ను హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. దర్యాప్తులో అత్యంత కీలకంగా మారింది సియా, చేతన్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు. ఇద్దరి మధ్య మొత్తం 2,004 ఫోన్ కాల్స్ జరిగినట్లు, దాదాపు 238 గంటల పాటు మాట్లాడుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇదే వారి మధ్య ఉన్న సన్నిహిత సంబంధంతో పాటు హత్య కుట్రకు బలమైన ఆధారంగా మారింది.

దర్యాప్తు ప్రకారం.. కేతన్‌ను హత్య చేయడానికి సియా గతంలోనే ఒకసారి ప్రయత్నించింది. లోహ్‌గఢ్ కోటకు తీసుకెళ్లి లోయలోకి తోసేయగా.. చెట్టు కొమ్మను పట్టుకుని కేతన్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఆ సమయంలో పాము కనిపించడంతో భయపడి తోసేశానంటూ సియా నమ్మించే ప్రయత్నం చేసింది. దీంతో ఆ ఘటనను ప్రమాదంగానే భావించారు. అయితే మొదటి ప్రయత్నం విఫలమైనా.. సియా వెనక్కి తగ్గలేదు. ఈసారి ప్రియుడు చేతన్‌తో కలిసి పక్కా ప్రణాళిక రూపొందించింది. జూన్ 18న బర్త్‌డే పేరుతో మరోసారి అదే ప్రాంతానికి కేతన్‌ను తీసుకెళ్లి హత్య చేసినట్టు పోలీసులు తేల్చారు. ట్రెక్కింగ్ చేస్తుండగా గాలికి బ్యాలెన్స్ కోల్పోయి లోయలో పడిపోయాడని సియా చెప్పినా.. ఆమె వాంగ్మూలంలో అనేక ప్రశ్నలు కనిపించాయి.

ఇక ఈ కేసును ఛేదించడంలో సీసీ కెమెరా దృశ్యాలు కీలకంగా మారాయి. లోహ్‌గఢ్ కోటకు వెళ్లే మార్గంలో తీవ్ర ఎండలోనూ హుడీ, ముసుగు ధరించి తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు గుర్తించారు. 33 డిగ్రీల ఉష్ణోగ్రతలో అలాంటి దుస్తులు ధరించడంపై అనుమానం రావడంతో అతడి వివరాలు ఆరా తీశారు. ఫొటోలను పోల్చి చూడగా.. అతడే సియా ప్రియుడు చేతన్ అని నిర్ధారణ అయింది. పోలీసులకు చిక్కకుండా ఉండాలనుకున్న ముసుగే చివరకు అతడిని పట్టించింది.

సియా ప్రవర్తనపై మొదటి నుంచే అనుమానం వ్యక్తం చేసిన కేతన్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు ముమ్మరమైంది. కాల్ డేటా, సీసీ ఫుటేజ్, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు.. ఇది ప్రమాదం కాదు, ముందే పథకం వేసి చేసిన హత్య అని నిర్ధారించి సియా గోయల్, చేతన్‌ను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తున్నాయి.

# ఉత్తరాది జలప్రళయం..

# అరుణాచల్‌ను ముంచెత్తిన ఫ్లాష్ ఫ్లడ్స్.. ముంబైకి 'రెడ్



దేశంలోని పలు రాష్ట్రాలను భారీ వర్షాలు, వరదలు వణికిస్తున్నాయి. అటు ఈశాన్య రాష్ట్రం అరుణాచల్ ప్రదేశ్‌ను హఠాత్తుగా వచ్చిన వరదలు ముంచెత్తగా.. ఇటు దేశ ఆర్థిక రాజధాని ముంబైని రికార్డు స్థాయి వర్షపాతం అతలాకుతలం చేస్తోంది. కొండచరియలు విరిగిపడటం, నదులు ఉప్పొంగడంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో ప్రజాజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ఉత్తరాది జలప్రళయం.. అరుణాచల్‌ను ముంచెత్తిన ఫ్లాష్ ఫ్లడ్స్.. ముంబైకి 'రెడ్ అలర్ట్'! దేశంలోని పలు రాష్ట్రాలను భారీ వర్షాలు, వరదలు వణికిస్తున్నాయి. అటు ఈశాన్య రాష్ట్రం అరుణాచల్ ప్రదేశ్‌ను హఠాత్తుగా వచ్చిన వరదలు ముంచెత్తగా.. ఇటు దేశ ఆర్థిక రాజధాని ముంబైని రికార్డు స్థాయి వర్షపాతం అతలాకుతలం చేస్తోంది. కొండచరియలు విరిగిపడటం, నదులు ఉప్పొంగడంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో ప్రజాజీవనం పూర్తిగా స్తంభించిపోయింది.

అరుణాచల్ ప్రదేశ్‌లో కురిసిన అతిభారీ వర్షాలు ఊహించని జలప్రళయాన్ని సృష్టించాయి. ముఖ్యంగా కేయీ పన్యోర్, లోయర్ సుబన్‌సిరి జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతాల్లో భారీగా కొండచరియలు విరిగిపడటంతో పాటు ఒక్కసారిగా ఫ్లాష్ ఫ్లడ్స్ సంభవించాయి. యాజలి, పోసా, యీయా వంటి గ్రామాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. వందలాది ఇళ్లు, వేల ఎకరాల్లో సాగు చేసిన వ్యవసాయ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పోసాలోని చీజుజూజా కాలనీలో సుమారు 15 నివాస గృహాలు వరద ఉద్ధృతికి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఓ ప్రధాన రహదారి వంతెన వరద నీటిలో కొట్టుకుపోవడంతో పలు ప్రాంతాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తక్కువ సమయంలోనే అత్యంత భారీ వర్షపాతం నమోదు కావడం వల్ల నదులలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగి ఈ ఘోర పరిస్థితి తలెత్తిందని అధికారులు చెబుతున్నారు. ఈ వరదల ధాటికి పలువురు స్థానికులు గల్లంతైనట్లు సమాచారం అందుతోంది. సహాయక బృందాలు రంగంలోకి దిగి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ సహాయక చర్యలను ముమ్మరం చేశాయి.

అసోంలో హై అలర్ట్..!

అరుణాచల్ ప్రదేశ్‌లో కురుస్తున్న ఈ భారీ వర్షాల ప్రభావం దిగువన ఉన్న అసోం రాష్ట్రంపై పడే అవకాశం ఉంది. అరుణాచల్ నదుల నుంచి వచ్చే వరద నీటి వల్ల అసోంలోనూ వరద ముప్పు పొంచి ఉండటంతో అక్కడి ప్రభుత్వం తీవ్ర అప్రమత్తత ప్రకటించింది. ప్రజలు ఎవరూ నదీ తీర ప్రాంతాలకు వెళ్లవద్దని, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది.

24 గంటల్లో 300 మి.మీ. వర్షపాతం!

మరోవైపు, దేశ ఆర్థిక రాజధాని ముంబైని సైతం భారీ వర్షాలు ముంచెత్తాయి. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నవీ ముంబైతో పాటు నగరంలోని పలు కీలక ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. ప్రసిద్ధ దాదర్ స్టేషన్‌లో రైలు పట్టాలపై భారీగా నీరు నిలిచిపోవడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బస్టాండ్‌లు, ప్రధాన కూడళ్లు నీట మునిగాయి. అనేక చోట్ల రహదారులపై మోకాళ్ల లోతు వరద నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ మైళ్ల మేర నిలిచిపోయింది. గడిచిన 24 గంటల్లోనే నగరంలో ఏకంగా 300 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (దీవీజ) వెల్లడించింది.

మరో రెండు రోజులు వానగండం!

ముంబైలోని పలు ప్రాంతాలకు వాతావరణ శాఖ అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. రాబోయే మరో రెండు రోజుల పాటు నగరంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

# రంగును బట్టి "రహదారులు" తెలుసుకోవచ్చు!
## - ఒక్కో కలర్‌కు ఒక్కో అర్థం!

ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు ఏదో ఒక సమయంలో ప్రయాణాలు చేస్తూనే ఉంటాం. స్కూల్, కాలేజీ, ఆఫీస్ సహా ఇతర అవసరాల కోసం రోడ్డు మీదకు వెళ్తూనే ఉంటాం. అయితే ఇలా ప్రయాణాలు చేసే సమయంలో మనకు రోడ్డు పక్కన కొన్ని మైలురాళ్లు కనిపిస్తుంటాయి. చాలా మంది వీటిని కేవలం డిస్టెన్స్ కోసం మాత్రమే చూస్తుంటారు. కానీ ఆ మైలు రాళ్లకు వేసిన ఒక్కో రంగుకు ఒక్కో అర్థముందంటున్నారు నిపుణులు. గూగుల్ మ్యాప్స్, జీపీఎస్ లేని కాలంలోనే ప్రయాణికుల కోసం భారత ప్రభుత్వం ఒక అద్భుతమైన 'దేశీ జీపీఎస్' వ్యవస్థను ఏర్పాటు చేసిందని.. అదే ఈ మైలు రాళ్లు అని చెబుతున్నారు. మరి సాధారణంగా మైలు రాళ్లపై ఏఏ రంగులు ఉంటాయి? వాటి అర్థాలు ఏంటి అనే వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.

పసుపు రంగు: రోడ్డు మీద వెళ్తున్నప్పుడు పైన పసుపు రంగు, కిందన తెలుపు రంగుతో ఓ రాయి కనిపిస్తుంది. అయితే ఈ రంగు మైలు రాయి జాతీయ రహదారులను సూచిస్తుందని నిపుణులు అంటున్నారు. ఈ రోడ్లు రాష్ట్రాలను , ప్రధాన నగరాలను కలుపుతాయట. ఇక వీటిని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా పర్యవేక్షిస్తుందని వివరిస్తున్నారు.

ఆకుపచ్చ: రోడ్డు పక్కన కనిపించే మైలు రాయి పై భాగంలో ఆకుపచ్చ రంగు ఉంటే అవి రాష్ట్ర పరిధిలోనివని అర్థమంటున్నారు. ఈ రోడ్లు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ముఖ్య పట్టణాలను కలుపుతాయంటున్నారు. ఈ రోడ్ల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుందని చెబుతున్నారు.

నలుపు లేదా తెలుపు : రోడ్డు మీద ప్రయాణిస్తున్నప్పుడు అచ్చం తెలుపు లేదా నలుపు రంగులు కనిపిస్తే అవి జిల్లాల మధ్య ఉన్న రోడ్లను సూచిస్తాయంటున్నారు. అంటే నగరాలు, పట్టణాలను కలిపే రోడ్లు ఇవీ. వీటిని స్థానిక సంస్థలు, జిల్లా యంత్రాంగం నిర్వహిస్తాయని వెల్లడిస్తున్నారు.

నారింజ రంగు: రోడ్డు పక్కన కనిపించే ఆరెంజ్ రంగు మైలు రాళ్లు గ్రామాలు, పరిసర ప్రాంతాలకు వెళ్లే రోడ్లను సూచిస్తాయట. ఈ రోడ్లను గ్రామీణాభివృద్ధి పథకాలు అంటే ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన వంటి కింద నిర్మిస్తుంటారని చెబుతున్నారు.

ఈ రంగులకూ అర్థముంది: రోడ్డు మీద వెళ్తున్నప్పుడు పైన చెప్పిన పసుపు, తెలుపు, నారింజ, ఆకుపచ్చ రంగులు ఎక్కువ చూసుంటాం. కానీ ఇతర రంగులు కూడా కనిపిస్తాయంటున్నారు నిపుణులు. అందులో

రోడ్డుపై వెళ్తుండగా రెడ్ కలర్ మైల్ స్టోన్ కనిపిస్తే ముందర రైల్వే లైన్ లేదా రైల్వే క్రాసింగ్ ఉందని అర్థమట. దీంతో వాహనదారులు స్పీడ్ తగ్గించి నిధానంగా వెళ్లాలని అర్థం.

ప్రయాణాల సమయంలో బ్లూ కలర్ రాయి కనిపిస్తే సమీపంలో విమానాశ్రయం ఉందని అర్థం చేసుకోవాలంటున్నారు నిపుణులు.

గోధుమ రంగుతో ఉన్న రాయి కనిపిస్తే సమీపంలో పోర్ట్ లేదా కోస్టల్ ఏరియా ఉన్నట్లు సూచని అని చెబుతున్నారు.

మైలురాయి పై భాగంలో బూడిద రంగు ఉంటే, సమీపంలో పెద్ద వంతెన, ఫ్లైఓవర్ లేదా భారీ కట్టడం రాబోతుందని అర్థం.

ఈ గీతలకు ప్రత్యేక అర్థాలు: మైలు రాళ్లతో పాటు రోడ్డు మధ్యలో కనిపించే గీతలకు కూడా ప్రత్యేక అర్థాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. అందులో

రోడ్డు మధ్యలో కాస్త గ్యాప్‌తో వైట్ కలర్ లైన్లు ఉంటాయి. అంటే ఈ లైన్ల అర్థం ఏంటంటే మీ ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయవచ్చు. అయితే ఇలా వాహనాన్ని దాటి ముందుకు వెళ్లేటప్పుడు ఎదురుగా ఇతర వాహనాలు రావడం లేదని గమనించుకోవడం ముఖ్యమంటున్నారు.

రోడ్డు మధ్యలో పసుపు రంగులో ఒకటే గీత ఉంటే ఈ రోడ్డుపై ఓవర్‌టేక్ చేయడం నిషిద్ధం అన్నట్లు. అంటే మీకు కేటాయించిన లైన్‌లోనే ప్రయాణం సాగించాలి.




# ఎల్‌నినో ఎఫెక్ట్.. పెరగనున్న ఆహార ధరలు..
# సామాన్యుడి బడ్జెట్‌కు తప్పని గండం!




ఒకప్పుడు దేశంలో నైరుతి రుతుపవనాల రాకను పండగలా స్వాగతించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. రుతుపవనాల ఆలస్యం లేదా బలహీనత కేవలం రైతులను మాత్రమే కాదు.. దేశ ఆహార ధరలు, ద్రవ్యోల్బణం, విద్యుత్ బిల్లులు, చివరికి రిజర్వ్ బ్యాంక్ నిర్ణయాలను కూడా శాసిస్తోంది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న 'ఎల్‌నినో' పరిస్థితులు సామాన్యుడి వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేయనున్నాయని ఆర్థిక, వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల దేశంలో బలహీనమైన రుతుపవనాలు నమోదయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఉత్తరప్రదేశ్, తమిళనాడు సహా 12 రాష్ట్రాల్లో వర్షపాతంలో తీవ్ర లోటు కనిపిస్తోంది. తీవ్రమైన వడగాడ్పుల కారణంగా దిగుబడులు తగ్గి టమోటో, పచ్చిమిర్చి, క్యాబేజీ వంటి కూరగాయల ధరలు ఇప్పటికే ఆకాశాన్ని తాకుతున్నాయి. రానున్న రోజుల్లో ఉల్లిపాయలు, బంగాళాదుంపల ధరలపై కూడా ఈ ఒత్తిడి పడనుంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ, వాతావరణ మార్పుల వల్ల ఆహార ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని బ్రోకరేజ్ సంస్థ 'బీఎన్‌సీ పారిబాస్' పేర్కొంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే రిజర్వ్ బ్యాంక్ తన ద్రవ్యోల్బణ అంచనాను 4.6 శాతం నుంచి ఏకంగా 5.1 శాతానికి పెంచింది. భారతదేశంలో సాగుభూమిలో సగానికి పైగా కేవలం వర్షాలపైనే ఆధారపడి ఉంది. తక్కువ వర్షాల వల్ల నేలలో తేమ తగ్గి, విత్తనాలు చల్లడం ఆలస్యమవుతోంది. ఫలితంగా వరి, పప్పుధాన్యాలు, పత్తి, చెరకు వంటి కీలక ఖరీఫ్ పంటల ఉత్పాదకత దెబ్బతినే ప్రమాదం ఉంది.'360 వన్ క్యాపిటల్ రీసెర్చ్' నివేదిక ప్రకారం, రుతుపవనాల ఆలస్యం వల్ల జూన్ 12 నాటికి దేశవ్యాప్తంగా ఖరీఫ్ సాగు విస్తీర్ణం 84.6 లక్షల హెక్టార్లకు పరిమితమైంది. ఇది గత ఏడాదితో పోలిస్తే 3.9 శాతం తక్కువ. వర్షాలు లేక రైతులు భూగర్భ జలాలపై ఆధారపడటంతో డీజిల్, విద్యుత్ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఈ ఎల్‌నినో ప్రభావం ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పెళ్లి పత్రికలపై వధూవరుల పుట్టిన తేదీ తప్పనిసరి!

# రూల్ బ్రేక్ చేస్తే ప్రింటింగ్ ప్రెస్‌లు కూడా సీజ్?

పెళ్లి పత్రికలపై వధూవరుల పుట్టిన తేదీ తప్పనిసరి! రూల్ బ్రేక్ చేస్తే ప్రింటింగ్ ప్రెస్‌లు కూడా సీజ్? సమాజంలో ఎంతగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ, చట్టాలు కఠినతరం చేసినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో బాల్యవివాహాల జాఢ్యం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ సామాజిక మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇకపై రాష్ట్రంలో ముద్రించే ప్రతి పెళ్లి పత్రికపై (ఔవసంఅఅస్త్ర ×అజఖ్ఫ్ఆశీఅ ఝుతీసం) పెళ్లికూతురు, పెళ్లికొడుకు పేర్లతో పాటు వారి పుట్టిన తేదీని ఖచ్చితంగా ముద్రించాలనే నిబంధనను తీసుకురావడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

సామాజిక రుగ్మతగా మారిన బాల్యవివాహాలను వేళ్లతో సహా పెకిలించివేయడానికి మహారాష్ట్ర ప్రభుత్వం సరికొత్త అస్త్రాన్ని సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో చట్టవిరుద్ధంగా జరుగుతున్న బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు, వివాహ ఆహ్వాన పత్రికలపై వధూవరుల పుట్టిన తేదీని నమోదు చేయడాన్ని ప్రభుత్వం త్వరలోనే చట్టబద్ధం చేయనుంది. ఈ మేరకు మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అదితి తట్కరే రాష్ట్ర అసెంబ్లీలో ఒక కీలక ప్రకటన చేశారు.

రాజస్థాన్ మోడల్ ఆధారంగా ప్రతిపాదన:

మహారాష్ట్ర అసెంబ్లీలో మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అదితి తట్కరే ఈ విషయమై కీలక ప్రకటన చేశారు. బాల్యవివాహాల వల్ల బాలికల విద్యాభ్యాసం, ఆరోగ్యం, వారి భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ప్రభుత్వం అంగీకరించింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే క్రమంలో, ఇప్పటికే రాజస్థాన్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న విధానాన్ని మహారాష్ట్రలోనూ ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఈ ప్రతిపాదన ప్రస్తుతం తుది పరిశీలనలో ఉంది. పెళ్లి పత్రికపై పుట్టిన తేదీ ఉండటం వల్ల, స్థానిక అధికారులు లేదా పౌరులు ఎవరైనా వధూవరుల వయస్సును సులభంగా తనిఖీ చేయడాని, చట్టవిరుద్ధమైన బాల్యవివాహాలను అడ్డుకోవడానికి వీలవుతుంది. రాష్ట్రంలో బాల్యవివాహాల నిరోధక యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నప్పటికీ, కొన్ని జిల్లాల్లో పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉంది. అసెంబ్లీలో సమర్పించిన వివరాల ప్రకారం.. పర్భణి జిల్లాలో దాదాపు 48శాతం మంది బాలికలకు, బీడ్ జిల్లాలో 43.7శాతం మందికి, ధులేలో 40.5శాతం మందికి, సోలాపూర్‌లో 40.3శాతం మందికి 18 ఏళ్లు నిండకుండానే వివాహాలు జరుగుతున్నట్లు షాకింగ్ నిజాలు వెలుగుచూశాయి. ముఖ్యంగా వలస కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఈ సమస్య తీవ్రత ఎక్కువగా ఉంది.

కఠినంగా మారనున్న నిబంధనలు:ఈ కొత్త ప్రతిపాదన ప్రకారం, కేవలం పుట్టిన తేదీని ముద్రించడమే కాకుండా.. వధూవరుల వయస్సును ధృవీకరించే అధికారిక పత్రాలను పరిశీలించిన తర్వాతే వెడ్డింగ్ కార్డులను ముద్రించాలని ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యాలకు నిబంధనలు విధించనున్నారు. ఒకవేళ ఏ ప్రింటింగ్ ప్రెస్ అయినా సరైన వయస్సు ధృవీకరణ లేకుండా, లేదా కార్డుపై పుట్టిన తేదీని ముద్రించకుండా వివాహ పత్రికలను ముద్రిస్తే.. వారి లైసెన్స్‌ను రద్దు చేయడంతో పాటు సదరు ప్రెస్‌ను సీజ్ చేసేలా చట్టాన్ని రూపొందిస్తున్నారు.

అంతేకాదు.. కొత్త నిబంధనల ప్రకారం బాల్యవివాహాలు చేసే కుటుంబ సభ్యులపైనే కాకుండా, ఆ వివాహాన్ని జరిపించే పూజారులు, వాయించే బ్యాండ్ మేళం సిబ్బంది, కేటరింగ్ నిర్వాహకులపై కూడా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోనున్నారు. చట్టాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో విద్య, అవగాహన





కార్యక్రమాలను విస్తృతం చేయడం ద్వారానే ఈ సమస్యను రూపుమాపగలమని ప్రభుత్వం స్పష్టం చేసింది. త్వరలోనే ఈ వెడ్డింగ్ కార్డ్ నిబంధనపై అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

జిల్లా టాస్క్ ఫోర్స్, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు:బాల్యవివాహాల నిరోధక చట్టాన్ని మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మరికొన్ని కీలక మార్పులను ప్రతిపాదించింది:

జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్: ప్రతి జిల్లాలో కలెక్టర్ నేతృత్వంలో ఒక ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయబడుతుంది. ఇది బాల్యవివాహాలపై వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తుంది.

ఫాస్ట్ ట్రాక్ కోర్టులు: బాల్యవివాహాల కేసులను వేగంగా విచారించి బాధ్యులకు త్వరితగతిన శిక్ష పడేలా ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయనున్నారు.ఆన్‌లైన్ పోర్టల్: ప్రజలు ఎవరైనా బాల్యవివాహాల గురించి రహస్యంగా ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఒక ప్రత్యేక వెబ్‌సైట్ లేదా పోర్టల్‌ను కూడా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానుంది.గ్రామీణ, వలస ప్రాంతాలలో బాలికల హక్కులను కాపాడటానికి ఈ కొత్త నిబంధనలు ఎంతగానో దోహదపడతాయని సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ బిల్లు త్వరలోనే అధికారిక చట్టంగా మారే అవకాశం ఉంది.

# కలలో ఎత్తు నుండి కింద పడిపోతున్నట్లు అనిపిస్తోందా?

# స్వప్న శాస్త్రం చెబుతున్న ఆ షాకింగ్ నిజాలు ఇవే!



నిద్రలో కొండ పైనుంచో, ఆకాశం నుంచో పడిపోతున్నట్లు కల వచ్చిందా?

రాత్రిపూట నిద్రించే సమయంలో మనకు వచ్చే రకరకాల కలలు, ముఖ్యంగా మనం ఏదైనా ఎత్తైన ప్రదేశం నుండి కింద పడిపోతున్నట్లు చూసినప్పుడు, తరచుగా మనల్ని తీవ్రమైన భయాందోళనలకు గురిచేస్తుంటాయి. స్వప్న శాస్త్రం ప్రకారం, కలలో ఎత్తు నుండి పడిపోవడాన్ని ఒక ముఖ్యమైన హెచ్చరికగా , ఆత్మపరిశీలనకు సంకేతంగా పరిగణిస్తారు. అయితే ఈ కల అర్థం ఏమిటి? ఇది రాబోయే కష్టానికి సంకేతమా లేక మానసిక ఒత్తిడి ఫలితమా అనే పూర్తి వివరాలు తెలుసుకుందాం.నిద్రలో మనం చూసే దృశ్యాలు మన మనస్సు, భావోద్వేగాలు , భవిష్యత్తు పరిస్థితులను సూచిస్తాయని నమ్ముతారు. ఎత్తు నుండి పడిపోతున్నట్లు కల కనడం అనేది జీవితంలోని అస్థిరత, భయం, ఒత్తిడి , మార్పులతో ముడిపడి ఉండే ఒక సాధారణ కలగా పరిగణిస్తారు. అయితే, ఈ కల అర్థం ప్రతి వ్యక్తికి ఒకేలా ఉండదు. అది మీరు ఎక్కడ నుండి పడిపోయారు , అప్పుడు ఉన్న పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

వివిధ ప్రదేశాల నుండి పడిపోవడం వల్ల కలిగే సంకేతాలు

ఇంటి పైకప్పు లేదా ఎత్తైన భవనం నుండి పడటం మీరు ఇంటి పైకప్పు, బాల్కనీ లేదా ఎత్తైన భవనం నుండి కింద పడుతున్నట్లు కలగంటే, అది మీ ఆర్థిక , సామాజిక జీవితానికి సంబంధించినదిగా భావించాలి. స్వప్న శాస్త్రం ప్రకారం, ఈ కల ఆర్థిక నష్టాన్ని, సమాజంలో హోదా తగ్గడాన్ని లేదా కార్యాలయంలో పెద్ద సవాళ్లను సూచించవచ్చు. అందుకే ఉద్యోగస్తులు , వ్యాపారవేత్తలు తమ ఆర్థిక నిర్ణయాలను చాలా తెలివిగా తీసుకోవాలని సూచించబడింది.ఆకాశం లేదా మేఘాల నుండి పడిపోవడం మీరు ఆకాశం, విమానం లేదా మేఘాల నుండి వేగంగా కింద పడిపోతున్నట్లు కల కనడం అనేది మీ మానసిక అలసట , భావోద్వేగ అసమతుల్యతకు సంకేతంగా పరిగణించబడుతుంది. తమ జీవితంలో అధిక బాధ్యతలు లేదా ఒత్తిడిని ఎదుర్కొంటున్న వ్యక్తులకు తరచుగా ఇటువంటి కలలు వస్తాయని నమ్ముతారు. రాబోయే కాలంలో ఆరోగ్యం, ప్రయాణం , డ్రైవింగ్ విషయాలలో అదనపు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. పర్వతంలో లేదా లోతైన కందకంలో పడిపోవడం మీరు పర్వతంలో, కొండ అంచున లేదా లోతైన లోయలో పడిపోతున్నట్లు కలగంటే, అది మీ ఆత్మవిశ్వాసానికి , సామాజిక ప్రతిష్టకు సంకేతం కావచ్చు. ఈ కల గౌరవ నష్టాన్ని, ఒక ముఖ్యమైన అవకాశాన్ని కోల్పోవడాన్ని సూచిస్తుంది. అయితే, భయపడటానికి బదులుగా మీ నిర్ణయాలను సమీక్షించుకోవడానికి ఇది ఒక మంచి అవకాశంగా భావించాలి.ఎవరైనా తోసేయడం లేదా జారి పడిపోవడం ఎవరైనా మిమ్మల్ని వెనుక నుండి తోస్తున్నట్లు లేదా పడిపోతున్నట్లు కల కనడం అనేది మీ వ్యక్తిగత సంబంధాలలో జాగ్రత్త వహించమని సూచిస్తుంది. మీకు అత్యంత సన్నిహితమైన వ్యక్తి మీ నమ్మకాన్ని వమ్ము చేయవచ్చని దీని అర్థం. అదే సమయంలో, మీరే స్వయంగా జారి పడిపోతే, తొందరపాటు నిర్ణయాలు మిమ్మల్ని ఇబ్బందుల్లోకి నెట్టవచ్చని గ్రహించాలి.అయితే, ఎత్తు నుండి పడిపోతున్నట్లు కల కనడం ఎల్లప్పుడూ చెడు శకునం కాదు. ఒకవేళ కింద పడిన తర్వాత కూడా మీకు ఎలాంటి గాయాలు కాకపోయినా లేదా మీరు ప్రాణాలతో బయటపడినా, అది ఒక శుభసూచకం. దీని అర్థం మీరు జీవితంలోని ప్రధాన సవాళ్లను విజయవంతంగా అధిగమిస్తారని అర్థం.

# బంగారం ధరలు



| | | |
|---|---|---|
| హైదరాబాద్ | ₹13,85,000 | ₹15,08,100 |
| ముంబయి | ₹13,81,000 | ₹15,06,600 |
| న్యూఢిల్లీ | ₹13,82,500 | ₹15,08,100 |

# వ్యాపారం

## హోం లోన్ తీసుకుంటున్నారా? బ్యాంకులు దాచిపెట్టే "స్ప్రెడ్" రహస్యం ఇదే.. ఇంత కథా ఉందా..



స్ప్రెడ్.. ఈ పదే చాలమంది వినే ఉండరు. హోం లోన్ తీసుకునేవారు దీని గురించి ఖచ్చితంగా తెలుసుకోవాల్సిందే. దీని గురించి అవగాహన లేకపోతే భారీ నష్టపోవాల్సి ఉంటుంది. అసలు స్ప్రెడ్ అంటే ఏంటి.. దీని వెనుక ఉన్న సీక్రెట్ ఏంటి అనే విషయాలు తెలుసుకుందాం.

సొంతింటి కలను సాకారం చేసుకోవాలనేది ప్రతీఒక్క సామాన్య, మధ్యతరగతి ప్రజల కల. ఇందుకోసం తమ శ్రమను ధారగా పోసి కష్టపడుతుంటారు. ఇవి సరిపోక బ్యాంక్ నుంచి హోం లోన్ తీసుకుంటుంటారు. ఇటువంటి సమయంలో ఏ బ్యాంకులో వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నాయనేది చెక్ చేసుకుంటారు. ఏ బ్యాంకులో తక్కువ వడ్డీ ఉంటే ఆ బ్యాంకులో తీసుకోవడం వల్ల మీకు డబ్బులు ఆదా అవుతాయి. హోం లోన్ అనగానే మొదటగా చూసేది వడ్డీ రేటునే గురించే. ఒక్కో బ్యాంక్ ఒక్కోలా వడ్డీ రేటును నిర్ణయిస్తుంది. ఒక బ్యాంకు 8.2 శాతం, మరో బ్యాంకు 8.5 శాతం వడ్డీ రేటును అందిస్తే.. మనం తక్కువ వడ్డీ రేటు ఉన్న బ్యాంకునే ఎంచుకుంటాము. వాస్తవానికి ఈ వడ్డీ రేట్ల వెనుక ఒక ముఖ్యమైన అంశం దాగి ఉంది. అదే 'స్ప్రెడ్'. దీని గురించి చాలామందికి తెలియక నష్టపోతున్నారు. అసలు స్ప్రెడ్ అంటే ఏంటి? అనేది చూద్దాం.

స్ప్రెడ్ అంటే ఏంటి?

హోం లోన్లకు సంబంధించి ఫ్లోటింగ్ వడ్డీ రేట్లు ఆర్బీఐ రెపో రేటు బేస్ రేటుకు అనుసంధానించబడి ఉంటాయి. బ్యాంకులు, ఈ బేస్ రేటుకు తమ 'స్ప్రెడ్'ను జోడించి కస్టమర్‌కు తుది వడ్డీ రేటును నిర్ణయిస్తాయి. బ్యాంకుకు లభించే లాభ మార్జిన్‌నే స్ప్రెడ్ అంటారు. బేస్ రేటు 6 శాతం, బ్యాంకు స్ప్రెడ్ 2.5 శాతంగా ఉంటే.. మీరు చెల్లించాల్సిన వడ్డీ రేటు 8.5 శాతం అవుతుంది. ఈ స్ప్రెడ్ అందరికీ ఒకేలా ఉండదు. కస్టమర్ క్రెడిట్ స్కోర్, ఆదాయం, ఉపాధి, రుణ మొత్తం, తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని బట్టి స్ప్రెడ్ నిర్ణయిస్తాయి. మంచి క్రెడిట్ స్కోర్, ఆదాయ స్థిరత్వం ఉంటే తక్కువ స్ప్రెడ్‌తో రుణం పొందవచ్చు. అధిక ఆర్థిక రిస్క్ ఉన్న వ్యక్తికి అధిక స్ప్రెడ్ రేటును బ్యాంకులు నిర్ణయిస్తాయి. అదే క్రెడిట్ స్కోర్ బాగుంటే తక్కువ స్ప్రెడ్ రేటు వల్ల మీరు డబ్బులు ఆదా చేసుకోవచ్చు.హోం లోన్ తీసుకునేముందు కేవలం వడ్డీ రేటు, నెలవారీ ఈఎమ్‌ఐ ఎంత అని అడిగితే సరిపోదు. బ్యాంకు ఉపయోగించే బేస్ రేటు ఎంత..? ఎంత స్ప్రెడ్ కలుపుతారు? తర్వాత ఈ స్ప్రెడ్ పెరుగుతుందా? అనే విషయాలను కూడా తెలుసుకోవాలి.

సంతకాలు పెట్టేముందు..

స్ప్రెడ్ రేటు ఎక్కువగా ఉంటే నెలవారీ చెల్లింపులలో ఒక చిన్న పెరుగుదల మాత్రమే అనుకుంటారు. కానీ రుణాన్ని 20 లేదా 25 సంవత్సరాల పాటు కొనసాగించినప్పుడు ఈ చిన్న తేడా పెద్దదిగా అనిపిస్తుంది. ఈఎమ్‌ఐల రూపంలో వేల, లక్షల రూపాయల అదనపు భారం అవుతుంది. అందుకే హోం లోన్ పేపర్లపై సంతకాలు పెట్టే సమయంలో గుడ్డిగా చేయకండి. డాక్యుమెంట్లు, వడ్డీ రేట్లు అన్నీ చదవండి. స్ప్రెడ్ గురించి బ్యాంకును అడిగి తెలుసుకోండి.

## మీ జీతాన్ని బట్టి.. మీరు ఏ బైక్ కొనాలో.. ఈ సింపుల్ ఫార్ములాతో ఈజీగా తెలుసుకోండి!





ప్రతి ఒక్క యువకుడికి ఒక డ్రీమ్ బైక్ ఉంటుంది. జాబ్ చేసేప్పుడు ఎలాగైనా ఆ డ్రీమ్‌ను ఫుల్‌ఫిల్ చేసుకుందాం అనుకుంటారు. ఈ క్రమంలోనే చాలా మంది సరైన అవగాహన లేక తమ బడ్జెట్‌కు మించిన ధర పెట్టి బైక్‌ను కొనేస్తుంటారు. కానీ తర్వాత ఈఎమ్‌ఐలు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. కాబట్టి మీరు బైక్ కొనేప్పుడు కొన్ని నియమాలు పాటిస్తే ఫ్యూచర్‌లో ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉంటారు. అవేంటో చూద్దాం.

మీరు మీకు వచ్చే జీతంతోనే మీ డ్రీమ్ బైక్‌ను కొని ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలంటే.. 10-3-15 అనే నియమాన్ని అర్థం చేసుకోవాలి. ఏమిటి? దీన్ని అర్థం చేసుకోవడం చాలా ఈజీగా ఈ నియమం ప్రకారం.. మీరు బైక్ కొనాలి అనుకుంటే.. ఆ బైక్ ధరలో 10 శాతం డబ్బును డౌన్ పేమెంట్‌గా చెల్లించండి. మిగతా మొత్తాన్ని మూడేళ్లకు ఈఎమ్‌ఐ కింద కన్వర్ట్ చేసుకోండి. పొరపాటున కూడా ఈ గడువు మూడేళ్లు దాటకుండా చూసుకోండి. అలాగే మీరు ఇక్కడ గుర్తుంచుకోవాల్సి ముఖ్యమైన విషయం ఏమింటంటే.. మీ మీ బైక్ కోసం కట్టే ఈఎమ్‌ఐ అనేది మీకు వచ్చే జీతంలో 15 శాతానికి మించకుండా ఉండేలా చూసుకోండి. ఈ నియమాన్ని పాటించడం ద్వారా మీరు బైక్ కొన్న కూడా తర్వాత పెద్దగా ఇబ్బందులు ఉండవు అని నిపుణులు చెబుతున్నారు.

మీ జీతం ఆధారంగా బైక్ బడ్జెట్ ఎంతో డిసైజ్ చేసుకోండి

నెలవారీ జీతం రూ.20,000 ఉన్నవారి బైక్ బడ్జెట్ ఎంత?

ఒక వేల మీకు నెలకు రూ. 20,000 జీతం చేతికి వస్తుంటే.. ఈ నియమం ప్రకారం మీ నెలవారీ ఈఎంఐ రూ.3,000 మించకూడదు. అలాగే మీరు కొనే బైక్ ధర రూ.1లక్షకు మించకూడదు. అంటే మీ బైక్ బడ్జెట్ వచ్చేసి రూ.లక్ష

నెలవారీ జీతం రూ.30,000 ఉన్నవారి బైక్ బడ్జెట్

ఒక వేల మీకు నెలకు రూ. 30,000 జీతం చేతికి వస్తుంటే.. ఈ నియమం ప్రకారం మీ నెలవారీ ఈఎంఐ రూ.4,500 మించకూడదు. అలాగే మీకు వచ్చే ఈ జీతంతో మీరు రూ.1,62,000 వరకు ధర ఉన్న బైక్‌ను కొనుగోలు చేయవచ్చు.

నెలవారీ జీతం రూ.50,000 ఉన్నవారి బైక్ బడ్జెట్

ఒక వేల మీకు నెలకు రూ. 50,000 జీతం చేతికి వస్తుంటే.. ఈ నియమం ప్రకారం మీ నెలవారీ ఈఎంఐ రూ.7,500 మించకూడదు. అలాగే మీకు వచ్చే ఈ జీతంతో మీరు రూ.2,70,000 వరకు ధర ఉన్న బైక్‌ను కొనుగోలు చేయవచ్చు. ఈ విధంగా, మీ నెలవారీ జీతానికి సరిపోయే సరైన బడ్జెట్‌ను నిర్ణయించుకోవడం ద్వారా మీ కలల వాహనాన్ని తెలివిగా కొనుగోలు చేయవచ్చు.

# క్రీడలు

## ఐర్లాండ్ గడ్డను టచ్ చేసిన 15 ఏళ్ల సునామీ.. ఆ సెల్ఫీతో మాస్ వార్నింగ్ ఇచ్చేసిన బుడ్డోడు..!





యువ ఆటగాళ్ల సత్తాకు ఈ ఐర్లాండ్ పర్యటన ఒక అగ్నిపరీక్ష లాంటిది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్న భారత్ ఈ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలని భావిస్తోంది. మరి 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ వేదికపై ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాడో చూడాలి.

ర్లాండ్ యువ జట్టుతో హోరాహోరీ పోరుకు భారత పురుషుల క్రికెట్ జట్టు సిద్ధమైంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమిండియా మంగళవారం చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరి ఐర్లాండ్‌లోని డబ్లిన్ నగరానికి చేరుకుంది. ఈ సిరీస్‌లో అందరి దృష్టి 15 ఏళ్ల నయా సంచలనం వైభవ్ సూర్యవంశీపైనే నెలకొంది.

ఐర్లాండ్ చేరుకున్న భారత యువ సింహాలు..

శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టు ఐర్లాండ్‌లో ల్యాండ్ అయింది. చెన్నై నుంచి ఉదయం విమానం ఎక్కిన మన ఆటగాళ్లు రాత్రి కల్లా డబ్లిన్ చేరుకున్నారు. విమానాశ్రయానికి చేరుకున్న ఆటగాళ్లకు అక్కడి యాజమాన్యం ఘన స్వాగతం పలికింది. ఈ పర్యటనలో భారత్ రెండు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినివ్వడంతో యువ రక్తాన్ని పరీక్షించేందుకు సెలెక్టర్లు ఈ సిరీస్‌ను వేదికగా చేసుకున్నారు.

సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న 'ఓపెనర్స్ సెల్ఫీ'..

ఈ పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బీహార్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ, విమాన ప్రయాణంలో తన సహచర ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి తీసుకున్న సెల్ఫీని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాడు. ఈ 15 ఏళ్ల కుర్రాడు సీనియర్ ఆటగాళ్లతో ఎంతో సరదాగా గడుపుతున్న ఫోటోలు చూసి క్రికెట్ అభిమానులు మురిసిపోతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది.

చరిత్ర సృష్టించనున్న 15 ఏళ్ల వండర్ కిడ్..

వైభవ్ సూర్యవంశీకి ఇది మొట్టమొదటి అంతర్జాతీయ సిరీస్ కావడం విశేషం. ఐర్లాండ్‌తో జరిగే మ్యాచ్‌లో గనుక ఈ యువకుడు బరిలోకి దిగితే, అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే అత్యంత పిన్న వయస్సులో అరంగేట్రం చేసిన ఆటగాడిగా వైభవ్ సరికొత్త రికార్డు సృష్టించనున్నాడు. ఇటీవల శ్రీలంక పర్యటనలో ఇండియా-ఏ జట్టు తరఫున ముక్కోణపు సిరీస్ గెలవడంలో వైభవ్ కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా శ్రీలంకతో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో కేవలం 29 బంతుల్లోనే 94 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. అదే ఫామ్‌ను ఇప్పుడు ఐర్లాండ్ సిరీస్‌లోనూ కొనసాగించాలని పట్టుదలగా ఉన్నాడు.

ఇంగ్లాండ్ సిరీస్ సాధించాలంటే ఇక్కడ గెలవాల్సిందే!

ఐర్లాండ్ సిరీస్ ముగిసిన వెంటనే భారత జట్టు నేరుగా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది.

## భారత్ వర్సెస్ ఐర్లాండ్ సమరం.. మ్యాచ్ టైమింగ్స్, ఫ్రీగా ఎలా చూడాలి? పూర్తి వివరాలు ఇవిగో..!



సారథిగా శ్రేయస్ అయ్యర్, దూకుడు మీదున్న అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ వంటి హిట్టర్లతో భారత బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తోంది. మరోవైపు ఐర్లాండ్ జట్టు సైతం తమ సొంత గడ్డపై భారత్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు ప్రణాళికలు రచిస్తోంది. సాయంత్రం 6 గంటలకే మ్యాచ్ ప్రారంభం కానుండటంతో అభిమానులకు ముందస్తుగానే క్రికెట్ వినోదం అందనుంది. ఈ పోరులో విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి.

క్రికెట్ అభిమానులకు సరికొత్త జోష్ అందించేందుకు టీమిండియా సిద్ధమైంది. ఐర్లాండ్ పర్యటనలో భాగంగా జరగబోయే పొట్టి పోరుకు సర్వం సిద్ధమైంది. ఈ రెండు టీ20ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఎప్పుడు, ఎక్కడ, ఏ సమయంలో ప్రారంభమవుతుంది? టీవీ, మొబైల్స్‌లో ఉచితంగా లైవ్ స్ట్రీమింగ్ ఎలా చూడాలో పూర్తి వివరాలు మీకోసం.

బెల్ఫాస్ట్ వేదికగా పొట్టి పోరు..

భారత యువ జట్టు ఐర్లాండ్ గడ్డపై తమ సత్తా చాటడానికి సిద్ధమైంది. ఈ పర్యటనలో భారత్, ఐర్లాండ్ జట్లు రెండు టీ20 మ్యాచ్‌లలో తలపడనున్నాయి. జూన్ 26న మొదటి మ్యాచ్, జూన్ 28న రెండో మ్యాచ్ జరగనున్నాయి. ఈ రెండు ఉత్కంఠభరిత పోరాటాలకు బెల్ఫాస్ట్‌లోని ప్రతిష్టాత్మక సివిల్ సర్వీస్ క్రికెట్ క్లబ్ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. కొత్త రక్తం, యువ ఆటగాళ్లతో కళకళలాడుతున్న భారత జట్టు ఈ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

మారిన మ్యాచ్ సమయాలు.. !

సాధారణంగా భారత్‌లో లేదా విదేశాల్లో జరిగే అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం రాత్రి 7:00 లేదా 7:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఆఫీసులు, పనుల నుంచి ఇంటికి తిరిగొచ్చే అభిమానులు మ్యాచ్‌ను ప్రశాంతంగా ఆస్వాదించడానికి బ్రాడ్‌కాస్టర్లు ఈ సమయాన్ని కేటాయిస్తుంటారు. అయితే, ఈ ఐర్లాండ్ సిరీస్ మ్యాచ్‌ల సమయాల్లో స్వల్ప మార్పు చోటుచేసుకుంది. ఈ రెండు మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం సాయంత్రం 6:00 గంటలకే ప్రారంభం కానున్నాయి. కాబట్టి క్రికెట్ ప్రేమికులు ఈ సమయాన్ని గుర్తుంచుకొని టీవీల ముందు వాలిపోవాల్సి ఉంటుంది.

ఉచితంగా లైవ్ ఎక్కడ చూడాలి? టెలికాస్ట్ వివరాలు..

ఈ సిరీస్ ప్రసార హక్కులను ప్రముఖ నెట్‌వర్క్ సొంతం చేసుకుంది. భారత్‌లో ఈ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాన్ని సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానళ్లలో వీక్షించవచ్చు. డిజిటల్ యూజర్లు సోనీ లివ్ యాప్, అలాగే వారి అధికారిక వెబ్‌సైట్‌లో లైవ్ స్ట్రీమింగ్‌ను ఆస్వాదించవచ్చు. తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్ భాషల్లోనూ ఈ మ్యాచ్ అందుబాటులో ఉండనుంది. ఇక అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే, డీడీ ఫ్రీ డిష్ వాడుతున్న వినియోగదారుల కోసం ఈ మ్యాచ్‌లు పూర్తిగా ఉచితంగా ప్రసారం కానున్నాయి. ఎలాంటి అదనపు రుసుము లేకుండా ఉచితంగా మ్యాచ్‌ను చూసి ఆనందించవచ్చు.

శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో యువ భారత్..

ఈ సిరీస్ కోసం భారత జట్టును సరికొత్తగా రంగంలోకి దించారు. సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి, ఐపీఎల్ లో రాణించిన కుర్రాళ్లకు పెద్దపీట వేశారు. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా, తెలుగు తేజం తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టడం విశేషం.

భారత జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, రవి బిష్ణోయ్, అభిషేక్ శర్మ, మహ్మద్ సిరాజ్, సంజూ శాంసన్, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, శివమ్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్.

ఐర్లాండ్ జట్టు: లోర్కాన్ టక్కర్ (కెప్టెన్/వికెట్ కీపర్), రాస్ అడైర్, బెన్ కాలిట్జ్, గారెత్ డెలానీ, జార్జ్ డాక్రెల్, స్టీఫెన్ డోహెనీ, మాథ్యూ హంఫ్రీస్, గావిన్ హోయ్, మాథ్యూ ఫోస్టర్, లియామ్ మెకార్తీ, జై ముంద్రా, హ్యారీ టెక్టర్, టిమ్ టెక్టర్, రూబెన్ విల్సన్.

# రానుంది అసలు ముప్పు!



రానుంది అసలు ముప్పు! భారత్‌లోని నగర జనాలను భయపెడుతున్న తీవ్ర హెచ్చరిక గ్లోబల్ క్రెడిట్ రేటింగ్ సంస్థ మూడీస్ హెచ్చరికల ప్రకారం, భారత్ తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. వ్యవసాయం, గృహాలు, డిజిటల్ రంగాల మధ్య నీటి పంపిణీ సమర్థంగా లేకపోవడం, రాష్ట్రాల పరిధిలో విభిన్న విధానాలు, వాతావరణ మార్పులు దీనికి ప్రధాన కారణాలు.భారత్‌లో నీటి నిర్వహణ వ్యవస్థను తక్షణమే బలోపేతం చేయకపోతే రాబోయే సంవత్సరాల్లో దేశం తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని గ్లోబల్ క్రెడిట్ రేటింగ్ సంస్థ మూడీస్ రేటింగ్స్ హెచ్చరించింది. వ్యవసాయం, గృహాలు, పరిశ్రమలు, వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ రంగాల మధ్య నీటి పంపిణీ సమర్థవంతంగా జరగకపోవడం ప్రధాన సమస్యగా పేర్కొంది. మూడీస్ విశ్లేషణ ప్రకారం.. భారతదేశంలో నీటి నిర్వహణ బాధ్యతలు ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉండటంతో దేశవ్యాప్తంగా ఏకీకృత విధానం అమలు కావడం లేదు. ప్రతి రాష్ట్రం వేర్వేరు ప్రాధాన్యతలు, విధానాలను అనుసరించడం వల్ల నీటి వనరుల సమన్వయ వినియోగం కష్టతరమవుతోంది. భారత్‌లో లభ్యమయ్యే మంచినీటిలో దాదాపు 80 శాతం వ్యవసాయ రంగానికే వినియోగమవుతోంది. రైతులకు నీరు, విద్యుత్‌పై సబ్సిడీలు అందించడం వల్ల ప్రభుత్వాలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. అదే సమయంలో నీటిని వ్యవసాయం నుంచి పరిశ్రమలు, పట్టణ అవసరాలకు మళ్లించే ప్రక్రియ నెమ్మదిగా సాగుతుండటంతో డిమాండ్ -- సరఫరా మధ్య అంతరం పెరుగుతోంది. ఇక దేశంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థ కూడా కొత్త సవాళ్లను సృష్టిస్తోంది. డేటా సెంటర్లు, క్లౌడ్ కంప్యూటింగ్ కేంద్రాలు, కృత్రిమ మేధ (ూ×) ఆధారిత పరిశ్రమలకు భారీ స్థాయిలో నీటి అవసరం ఉంది. ముఖ్యంగా సర్వర్లను చల్లబరచడానికి పెద్ద మొత్తంలో నీటిని వినియోగించాల్సి వస్తోంది. భవిష్యత్తులో ఈ రంగం మరింత విస్తరించడంతో నీటి డిమాండ్ గణనీయంగా పెరిగే అవకాశం ఉందని మూడీస్ అంచనా వేసింది. వాతావరణ మార్పులు పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి. తరచూ సంభవిస్తున్న కరువులు, వరదలు, అస్థిర రుతుపవనాలు, మారుతున్న వర్షపాతం సరళి దేశ నీటి భద్రతపై ప్రభావం చూపుతున్నాయి. దీనికి తోడు భూగర్భ జలాల అధిక వినియోగం, పాతబడిన పైప్‌లైన్ వ్యవస్థలు సమస్యను మరింత తీవ్రమం చేస్తున్నాయి. దేశంలోని ప్రధాన నగరాలు ఇప్పటికే నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ముంబైలోని జలాశయాల్లో నిల్వలు ఆందోళనకర స్థాయికి పడిపోగా, ఢిల్లీలో అనేక ప్రాంతాలు నీటి కొరతతో ఇబ్బంది పడుతున్నాయి. చెన్నై ప్రస్తుతం కొంత మెరుగైన స్థితిలో ఉన్నప్పటికీ, భవిష్యత్తులో పెరుగుతున్న డిమాండ్ అక్కడ కూడా సవాళ్లను సృష్టించే అవకాశం ఉంది. పెరుగుతున్న జనాభా, పారిశ్రామికీకరణ, వాతావరణ మార్పుల నేపథ్యంలో సమర్థవంతమైన నీటి నిర్వహణ కేవలం పర్యావరణ పరిరక్షణకే కాదు, దేశ ఆర్థిక స్థిరత్వానికి కూడా అత్యంత కీలకమని మూడీస్ స్పష్టం చేసింది. దీర్ఘకాలిక ప్రణాళికలు, పటిష్టమైన నీటి పాలన, వనరుల సమర్థ వినియోగం లేకపోతే భారత్ మరింత తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

# రైలు ప్రయాణికులకు అలర్ట్.. స్మోకింగ్ చేస్తే భారీ జరిమానా.. జైలు శిక్ష !




రైలు ప్రయాణికుల రక్షణ, సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం రైల్వే నిబంధనలను మరింత కఠినతరం చేసింది. కొత్తగా తీసుకొచ్చిన 'జన్ విశ్వాస్ చట్టం-2026' కింద రూపొందించిన నిబంధనలు జూన్ 19 నుంచి తక్షణమే అమలులోకి వచ్చాయి. దీని ప్రకారం రైళ్లు, రైల్వే ప్రాంగణాలలో ధూమపానం, అనధికారిక వ్యాపారాలు, భిక్షాటన చేయడాన్ని తీవ్రమైన నేరాలుగా పరిగణించనున్నారు. గతంలో ఉన్న ధూమపానానికి ఉన్న రూ.100 జరిమానాను ఏకంగా రూ.2,000కు పెంచారు. స్మోకింగ్ చేస్తూ దొరికితే టికెట్ రద్దు చేసి, తదుపరి స్టేషన్‌లోనే రైలు నుంచి దింపేస్తారు. ఒకవేళ అక్కడికక్కడే జరిమానా చెల్లించకపోతే కోర్టు ముందు హాజరుపరుస్తారు, అక్కడ నేరం రుజువైతే గరిష్టంగా రూ.5,000 వరకు జరిమానా పడే అవకాశం ఉంది. మరోవైపు సెక్షన్ 144 కింద రైల్వే లైసెన్స్ లేకుండా రైళ్లలో తిరుగుతూ వ్యాపారం చేసే హ్యాకర్లు, భిక్షాటన చేసే వారిపై పూర్తి నిషేధం విధించారు. వీరికి కూడా రూ.2,000 జరిమానా విధిస్తారు. ఒకవేళ వీరు జరిమానా కట్టని పక్షంలో కోర్టు ద్వారా 3 నెలల వరకు జైలు శిక్ష, రూ.5,000 ఫైన్ లేదా ఈ రెండూ విధించేలా చట్టాన్ని సవరించారు. ఇక పదే పదే ఈ నిబంధనలు ఉల్లంఘిస్తూ దొరికిపోతే కనీసం 3 నెలల నుంచి గరిష్టంగా ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. క్రిమినల్ ప్రాసిక్యూషన్‌తో సంబంధం లేకుండా, సివిల్ మరియు అడ్మినిస్ట్రేటివ్ చర్యల ద్వారా అప్పటికప్పుడే జరిమానాలు వసూలు చేసే పూర్తి అధికారాలను రైల్వే అధికారులకు కేంద్రం కల్పించింది. ఫలితంగా త్వరలోనే రైల్వే స్టేషన్లలో తనిఖీలు ముమ్మరం కానున్నాయి.

Printed, Published and Owned by J BHASKER, and Printed at Sunday Printing Press, H.No.361, Bhagyalaxmi Colony, Quthbullapur, MEDCHAL MALKAJGIRI, Telangana- 500054. and Published from H.No.3-87, Gangaram, Marepalli, Kondapur, SANGAREDDY, TELANGANA - 502306.. Editor: J BHASKER. PRGI NO : TGTEL/25/A3369 Email: samastaprakshalanam@gmail.com. Phone No: 9959479375, 9398191920.